ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

ప్రకాశం
జిల్లా వార్తలు

గురువారం 27, ఫిబ్రవరి 2025


జమ్ములపాలెం 1,116 శివలింగాల వేదికలో భక్తుల పూజలు

మార్కాపురం మార్కండేశ్వర స్వామి ఆలయంలో భక్తుల క్యూ



ప్రతి మదీ పంచాక్షరి జపంతో తరించింది. ప్రతి గొంతూ ఓంకారనాదాన్ని పలికింది. 'నమో నమః.. నమో నమః శివాయ' స్వరాలు, ఢమ.. ఢమ.. ఢమరుక శబ్దాలు, అర్చకుల మంత్రోచ్చరణలు, భక్తుల జాగరణలతో పరమశివుడు పులకించేలా శైవాలయాలు మార్మోగాయి. ఆదిదేవుడికి అత్యంత ఇష్టమైన రోజైన శివరాత్రి సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అర్చనలు, అభిషేకాలు, హోమాలు, శివపార్వతుల కల్యాణాలతో కనువిందుచేశాయి. ప్రముఖ క్షేత్రాలైన త్రిపురాంతకం, భైరవకోన, రామతీర్థం, సంగమేశ్వరం, జమ్ములపాలెంలోని 1,116 శివలింగాల వేదికకు భక్తులు పోటెత్తి సర్వేశ్వరుడి సేవలో మునిగితేలారు. నగరోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్లాదపరిచాయి.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు

- ఉప్పొంగిన భక్తిభావం
- అర్చనలు, అభిషేకాలు, హోమాలు..
- ఆకట్టుకున్న నగరోత్సవాలు
- జిల్లా వ్యాప్తంగా శివరాత్రి శోభ

నమో నమః శివాయ..

శివనామస్మరణతో మార్మోగిన శైవాలయాలు


పొదిలి శివాలయంలో పూజలు


త్రిపురాంతకేశ్వరాలయంలో ఎస్పీ దంపతులు


ఒంగోలులోని సంతపేట సాయిబాబా మందిరంలో హోమం




ఒంగోలులోని కాశీవిశ్వేశ్వరాలయంలో భక్తురాలి పూజలు


భైరవకోన వద్ద భక్తుల రద్దీ


రామతీర్థంలోని మోక్షరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భారీ క్యూ


త్రిపురాంతకేశ్వరాలయంలోని క్యూ లైన్లలో భక్తులు

సచివాలయ వ్యవస్థను పటిష్టం చేస్తాం

- మెరుగైన సేవల కోసమే ఉద్యోగుల రేషనలైజేషన్
- మంత్రి డాక్టర్ స్వామి



టంగుటూరు, ఫిబ్రవరి 26 : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను పటిష్టం చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయాల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే వాటిలో పనిచేస్తున్న ఉద్యోగుల్ని రేషనలైజేషన్ చేస్తున్నామని స్పష్టం చేశారు. మండలంలోని తూర్పునాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో ఉన్న ఆయన్ను గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘ నాయకులు బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సచివాలయం ప్రాతిపదికన కాకుండా క్లస్టర్ వారీగా రేషనలైజేషన్ చేసి అర్హులైన వారికి ఉద్యోగోన్నతి ఇవ్వాలని కోరారు. డిజిటల్ అసిస్టెంట్లకు పీఎస్ గ్రేడ్-5తోపాటు ఇతర శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లో సమాన హోదా కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ రేషనలైజేషన్ ప్రక్రియపై ఇప్పటికే ఉద్యోగ సంఘాల అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. దీనిపై సీనియర్ అధికారులతో కమిటీ వేసి చర్చించి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో గ్రామ వార్డు సచివాయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జీవీవీ రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు అఖిల్, చంద్రబాబు, చాంద్‌బాషా, రాజశేఖర్, గంగుల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

హోంవర్క్ చేయలేదని విద్యార్థికి వాతలు

- ఒంగోలులో ట్యూషన్ టీచర్ దారుణం
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు

వివరాలు మెయిన్‌లో..

ఊరించే పదవులు.. పూరించేదెప్పుడు?

నామినేటెడ్ పోస్టుల కోసం తెలుగు తమ్ముళ్ల ఎదురుచూపులు

- కార్పొరేషన్ల చైర్మన్లు ఓకే
- మమ్మల్ని పట్టించుకునేదెప్పుడు?
- జాప్యంపై కేడర్‌లో తీవ్ర అసంతృప్తి
- సింగిల్ విండోలు, ఏఎంసీలు, జిల్లాస్థాయి పదవులన్నీ ఖాళీ
- ఇదిగోఅదిగో అంటూ అధిష్ఠానం కాలయాపన



'మనం అధికారంలోకి వచ్చి తొమ్మిది మాసాలైంది. పోటీచేసిన వాళ్లు ఎమ్మెల్యేలు అయ్యారు. వారిలో కొందరికి మంత్రి పదవులు దక్కాయి. మిగిలిన వారిలో ప్రముఖులు రాష్ట్రస్థాయిలోని వివిధ కార్పొరేషన్‌లకు చైర్మన్లు అయ్యారు. మనకే ఏం లభించలేదు. కళ్లెదుట నామినేటెడ్ పదవులన్నీ ఖాళీనే. అదిగో.. ఇదిగో.. అంటూ ప్రకటనల హడావుడే తప్ప వాటిని పూర్తిచేసింది లేదు' ఇదీ తెలుగుదేశం పార్టీలోని జిల్లా నుంచి కిందిస్థాయి వరకు ఉన్న నాయకుల ఆవేదన. ఆశావహుల్లో అయితే తీవ్ర నైరాశ్యం నెలకొంది. జిల్లాలో వివిధ స్థాయిల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవులను భర్తీ చేయకపోవడమే అందుకు కారణమైంది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి రమారమి తొమ్మిది నెలలు కావస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 అసెంబ్లీ స్థానాల్లో పది టీడీపీ గెలుచుకోవడంతోపాటు పార్లమెంట్ స్థానాలనూ కైవసం చేసుకుంది. అందుకు తగ్గట్టు ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. ఆతర్వాత తెలుగుదేశం పార్టీలో ముగ్గురికి, బీజేపీలో, జనసేనలో ఒక్కొక్కరికి రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవులు, మరికొందరికి డైరెక్టర్ పోస్టులు లభించాయి. కానీ ఇతర నామినేటెడ్ పదవుల విషయంలో నాన్చుడు ధోరణి కనిపిస్తోంది. ద్వితీయస్థాయి నాయకత్వంలో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

హడావుడి చేశారు.. పక్కనేశారు

ఇటీవల కొన్ని నామినేటెడ్ పదవుల విషయంలో అటు పార్టీ అధిష్ఠానం, ఇటు ప్రభుత్వ ఉన్నతాధికారులు హడావుడి చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామకం, సహకార సంఘాల (సింగిల్‌విండో) పాలక మండళ్ల నియామకాల విషయమే ఇందుకు నిదర్శనం. ఈ రెండింటి పాలకమండళ్ల కాల పరిమితి తీరిపోయింది. ప్రస్తుతం సెంట్రల్ బ్యాంకు, సొసైటీలకు అధికారిక పీఐసీలు నడుస్తున్నాయి. వాటిస్థానంలో పాలక మండళ్లను నియమించుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. కానీ ఇప్పటికీ నియామకాలను పూర్తి చేయలేదు. జిల్లా స్థాయిలో సెంట్రల్ బ్యాంక్‌కు పర్సన్ ఇన్‌చార్జి నియామకంపై ఉమ్మడి జిల్లా టీడీపీ నేతలంతా కుస్తీ పట్టారు. ఒకసారి ఒంగోలులో, మరోసారి తాడేపల్లిలోని మంత్రి రవికుమార్ ఇంట్లో సమావేశమై జిల్లాస్థాయి నామినేటెడ్ పదవులపై సుదీర్ఘంగా సమీక్ష చేశారు. కానీ ఇంతవరకూ సెంట్రల్ బ్యాంకుకు కాకపోయినా సింగిల్ విండోల పాలక మండళ్ల నియామకం కూడా ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

జిల్లాస్థాయి పదవులూ అంతే..

సెంట్రల్ బ్యాంక్, డీసీఎంఎస్, గ్రంథాలయం, వక్ఫ్‌బోర్డు, కోల్ సొసైటీ, పొగాకు సమాఖ్యతోపాటు ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) లాంటి సంస్థల నామినేటెడ్ పదవులు ఖాళీగా ఉన్నాయి. వాటికోసం కూటమి భాగస్వామ్య పార్టీల్లోని కొందరు నాయకులు వారివారి ప్రయత్నాల్లో ఉన్నారు. కానీ అధిష్ఠానం నుంచి నిర్ణయం వెల్లడి కాలేదు. దీంతో కూటమి పార్టీల్లోని అధిష్ఠానాల వైఖరితో యావత్తు కిందిస్థాయి నాయకత్వం తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతోంది.

నివేదికలను పక్కనపెట్టారు!

వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ల నియామకం కూడా అర్ధంతరంగా ఆగిపోయింది. ఎమ్మెల్యేలు, ఇతర నాయకులతో సంప్రదించకుండా గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానంలోనే చైర్మన్ పదవుల రిజర్వేషన్లు కొనసాగించాలని టీడీపీ అధిష్ఠానం నిర్ణయించింది. ఎమ్మెల్యేలు మదనపడినా, ఒకరిద్దరు ధైర్యం చేసి రిజర్వేషన్ల విధానం వద్దని అధినాయకుల వద్ద మొత్తుకున్నా వారు వినలేదు. తొలుత రిజర్వేషన్ల ఖరారు విషయాన్ని కలెక్టర్లకు ఇచ్చారు. అనంతరం ఆ బాధ్యతను ఇన్‌చార్జి మంత్రులకు అప్పగించారు. వారంతా టీడీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో మాట్లాడి ఏఏ ఏఎంసీ చైర్మన్ పదవి ఏ సామాజికవర్గానికి రిజర్వు చేయాలో సూచిస్తూ నివేదికలు పంపారు. వాటిని పక్కన పడేసిన అధిష్ఠానమే ఒక నివేదిక తయారు చేసింది. దానిపై కొందరు ఎమ్మెల్యేలు అభ్యంతరాలు, కొందరు మీ ఇష్టమంటూ సమాధానాలు ఇచ్చారు. తీరా చూస్తే ఆ రిజర్వేషన్లు ఖరారును కూడా అధిష్ఠానం మళ్లీ పక్కనపెట్టింది.

ఇంటర్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు

- పరీక్షా కేంద్రానికి 3 నుంచి 25 కి.మీ వారికి ఏర్పాటు

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మార్చి 1 నుంచి ప్రారంభమవుతున్న ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9గంటలకు ప్రారంభం కానున్నాయి. 8.30గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఆ తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. ఈనేపథ్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొనేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తే అవి సకాలంలో చేరుతాయో లేదోనన్న నమ్మకం లేదు. కలెక్టర్ సూచన మేరకు ఆర్ఐవో.. ఆర్టీసీ అధికారులకు రూట్‌మ్యాప్ ఇచ్చారు. దాని ప్రకారం జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాలకు చేరుకొనేందుకు 30 జూనియర్ కళాశాలల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. పరీక్షా కేంద్రాలకు 3 నుంచి 25 కిలో మీటర్ల దూరం వరకూ ఈ సర్వీసులను నడపనున్నారు.

బస్సులు తిరిగే ప్రత్యేక రూట్లు ఇవే..

ఆర్టీసీ బస్సులను ఏ కళాశాలల నుంచి ఏ పరీక్షా కేంద్రం వరకు నడపాలన్న విషయాన్ని ఆర్ఐవో ఆర్టీసీ అధికారులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. బేస్తవారపేట కేజీబీవీ నుంచి కంభంకు, శాంతినగర్ ఏపీ మోడల్ స్కూల్ నుంచి దర్శికి, కురిచేడు కేజీబీవీ హైస్కూల్ ప్లస్ నుంచి దొనకొండకు నడపాల్సిన అవసరం ఉంది. ముండ్లపాడు హైస్కూల్ నుంచి గిద్దలూరుకు, పీసీపల్లి కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కనిగిరికి, హెచ్ఎంపాడు కేజీబీవీ, వెలిగండ్ల కేజీబీవీ, శంకవరం ఏపీ మోడల్ స్కూలు నుంచి కనిగిరికి ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయనున్నారు. రాజుపాలెం కేజీబీవీ నుంచి కొమరోలులు, కరవది హైస్కూలు ప్లస్ నుంచి మద్దిపాడుకు, వెలుగొండ ఏపీఎస్‌డబ్ల్యూఆర్, కలుజువ్వలపాడు కేజీబీవీ, మిట్టమీదపల్లి మోడల్ స్కూలు నుంచి మార్కాపురం వరకు, పెద్దారవీడు ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ.. మల్లికార్జునపురం మోడల్ స్కూలు నుంచి పెద్దదోర్నాలకు, గొట్లగట్టు కేజీబీవీ, మద్రిపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల, అర్‌వీపాలెం కేజీబీవీ నుంచి పొదిలికి బస్సులు నడుపుతారు. ముండ్లమూరు కేజీబీవీ నుంచి తాళ్లూరుకు, కొత్తపట్నం హైస్కూలు ప్లస్, అక్కడి కేజీబీవీ నుంచి టంగుటూరుకు, రాచర్ల ఏపీ మోడల్ స్కూలు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్, కేజీబీవీ నుంచి తురిమెళ్లకు, దూపాడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ నుంచి త్రిపురాంతకానికి, అమ్మనబ్రోలు ఎంఎస్సార్ కళాశాల నుంచి ఉప్పుగుండూరుకు, పుల్లలచెరువు కేజీబీవీ నుంచి యర్రగొండపాలెంకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయనున్నారు. పరీక్షల ప్రారంభం తేదీ నుంచి ముగింపు వరకు విద్యార్థులకు ఈ ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఉంటుంది.


కొప్పోలులో శ్రీభీమేశ్వరస్వామి వారి ఊరేగింపు


కొండపిలోని శ్రీగంగాపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం


ఉప్పుగుండూరులో శివపార్వతుల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి, శ్రీదేవి,భూదేవి సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి

హరహర మహాదేవా..!

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- కనులవిందుగా శివపార్వతుల కల్యాణం


మద్దిపాడులోని శివాలయానికి విద్యుద్దీపాలంకరణ


ఒంగోలులోని సంతపేటలో శివలింగానికి అభిషేకం


కొత్తపట్నం బస్టాండు వద్ద శివాలయంలో భక్తుల సందడి


రామతీర్థంలో పూజలు చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలు బుధవారం ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచే భక్తుల రాకతో పలు శివాలయాలు కిటకిటలాడాయి. ఒంగోలు నగరంలో ప్రసిద్ధ శివాలయాలుగా పేరుపొందిన కేశవస్వామిపేట శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండలులోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఇక మహిళలు దీపారాధనలు సైతం చేసి స్వామివారికి హారతులిచ్చారు. కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు శంకరమంచి రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. రాత్రి లింగోద్భవ మహారుద్రాభిషేకం, అనంతరం పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం నయనమనోహరంగా నిర్వహించారు. ఈవో శివశంకర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- కొత్తపట్నం బస్టాండలులోని శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆమంచి మణికంఠశర్మ యాజ్ఞీకంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారి నామంతో ఏకాహాన్ని నిర్వహించారు. ఈవో శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గురువారం ఉదయం స్వామివారి కళ్యాణోత్సవం, సాయంత్రం నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

- స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలోని ఉపాలయం శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో వేదపండితులు మఠంపల్లి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో సామూహిక అభిషేకాలు, లింగోద్భవ కాలంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కుటుంబసమేతంగా అభిషేకంలో పాల్గొన్నారు. గురువారం ఉదయం పూర్ణాహుతి, పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం ఉంటాయని ఆలయ వర్గాలు తెలిపారు.

- అదేవిధంగా స్థానిక మంగమూరు రోడ్డు శ్రీఅచలానంద ఆశ్రమం, అంజయ్య రోడ్డు పంచముఖ శివాలయం, మంగమూరు రోడ్డులోని శ్రీసత్యసాయి మందిరం, కొణిజేడు బస్టాండు శ్రీవిఘ్నేశ్వర ఆలయం మొదలైన పలు ఆలయాలలో సైతం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి.

కొప్పోలులో..

ఒంగోలు(రూరల్): ఒంగోలు నగరం కొప్పోలులోని శ్రీభీమేశ్వరస్వామివారి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. భక్తులు స్వామివార్లకు వారు పోసి మంగళహారతులు ఇచ్చారు. అర్చకుడు రమేష్‌పంతులు ప్రత్యేక పూజలు చేశారు. ఇక గుండాయిపాలెం, ఉలిచి, కరవది, త్రోవగుంట, చెరువుకొమ్ముపాలెం, పెళ్లూరు గ్రామాల్లోని శివాలయాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంతనూతలపాడులోని త్రిపురాంతకస్వామి ఆలయం, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకళ్యాణవేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తెల్లవారకముందే ఆలయాల్లో ప్రత్యేకంగా దీపారాధన చేసి స్వామి వార్లను దర్శించుకున్నారు. మాజీ సర్పంచ్ శిఖాకొల్లి నరసింహస్వామి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు. సేవాసంకల్ప్‌ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలను అందించారు.

నాగులుప్పలపాడు మండలంలో..

నాగులుప్పలపాడు: మహాశివరాత్రి వేడుకలను మండలంలో వైభవంగా జరిగాయి, ఉప్పుగుండూరు శివాలయంలో శివపార్వతుల కళ్యాణం వేద పండితులు శిష్టా పాండురంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నదానం చేశారు. అమ్మనబ్రోలు చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో ఈవో దామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివార్ల కళ్యాణం నిర్వహించారు. మాచెర్ల గ్రామానికి చెందిన శివసాయి కోలాట బృందం కోలాటం నిర్వహించారు. ఇక చదలవాడ లింగోద్భవస్వామి దేవస్థానంలో ఈవో అనిల్ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. కనపర్తి ఏలేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శైవక్షేత్రాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. సాయంత్రం స్వామివార్లను గ్రామోత్సవం నిర్వహించారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు

చీమకుర్తి: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన రామతీర్థం మోక్షరామలింగేశ్వరస్వామి మూలవిరాట్‌ని మహాశివరాత్రి పర్వదినాన దర్శించుకోవటానికి జిల్లా నలువైపులనుంచి భక్తులు పోటెత్తారు. వేకువజామునుంచే ఆలయంలో అభిషేకాలు, విశేషపూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున రావడం, క్యూలైన్‌లు ఏర్పాటు చేయకపోవటంతో ఎండలోనే భక్తులు స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది. దర్శనానికి మూడుగంటల సమయం పట్టింది. దాతలు భక్తులకు తాగునీరు, ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్ని కులసంఘాల ఆధ్వర్యంలో వారి సత్రాల్లో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చీమకుర్తి ఎస్‌ఐ కృష్ణయ్య, మద్దిపాడు ఎస్‌ఐ శివరామయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎంపీపీ మేదరమెట్ల ఈశ్వరమ్మ , శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ డీఈఈ మాకినేని హరిబాబు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. కాగా ఆలయంలో ఏర్పాట్లు సక్రమంగా చేయకపోవడంతో భక్తుల అసహనం వ్యక్తం చేశారు.


స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు, పూజలు చేస్తున్న అర్చకుడు

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: మహాశివరాత్రి వేడుకలు మండలంలోని అత్యంత వైభవంగా జరిగాయి. నందిపాడు శ్రీగంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకులు రాజుపంతులు ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, కుంకుమ పూజ, కల్యాణం ఘనంగా నిర్వహించారు. వెల్లంపల్లి, దొడ్డవరం శివాలయం, గుండ్లాపల్లి సోమేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఘడియపూడి కాలనీలోని శివాలయం అర్చకుడు ఆలమరాజుపల్లి రమేష్ నిర్వహించారు.

- కె.ఉప్పలపాడులోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనకర్లపూడి, ముప్పవరం, పెదకండ్లగుంట గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు స్వామికి నిర్వహించారు.

టంగుటూరు మండలంలో..

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెంలోని 1,116 శివలింగాల వేదిక, పసుకుదురు నందలి శ్రీగంగా పర్వత వర్ధని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి వారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునుండే శివాలయాలు భక్తులతో సందడిగా కనిపించాయి. 108 శక్తిపీఠ సమేత 1,116 మహాలింగ సహిత శ్రీపంచముఖేశ్వర స్వామివారి దేవస్థానం, పసుకుదురునందలి శ్రీగంగా పర్వత వర్ధని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి వారి దేవస్థానాల్లో భక్తులు పూజలు చేశారు. జమ్ములపాలెంలోని 1,116 మహాలింగ సహిత శ్రీ పంచముఖేశ్వరస్వామివారి ఆలయంలో ఒంగోలుకు చెందిన ఐక్యతా వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.


కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాన్ని ఆలస్యంగా తెరడంతో సామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఇబ్బందిపడ్డారు. ఉదయం 11గంటల వరకు వేచి చూసిన భక్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది.

కొండపి మండలంలో..

కొండపి: స్థానిక శ్రీగంగాపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వంశపారంపర్య నిర్వాహకులు ఆరికట్ల వీరభద్రయ్య, సుజాత, ఆరికట్ల శోభన్ చౌదరి, లీలా భార్గవి స్వహస్తాలతో జరిపించారు. స్వామి కల్యాణాన్ని కన్నులపండువగా అర్చకులు సోమరాజుపల్లి సాయిశర్మ, సోమరాజుపల్లి రమేష్ నిర్వహించారు.

సింగరాయకొండ మండలంలో..

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని అయ్యప్పనగర్‌లోని అయ్యప్ప దేవస్థానంలో బుధవారం శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పాకలోని అతిపురాతన శివాలయంలో గంగా పార్వతీసామేత కాశీవిశ్వనాథుడికి పూజలు నిర్వహించారు.

శనీశ్వర ఆలయంలో సత్య పూజలు


సంగమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దామచర్ల సత్య దంపతులు

జరుగుమల్లి: మండలంలోని నర్సింగోలులోని శనీశ్వర ఆలయంలో శివరాత్రి సందర్భంగా ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య దంపతులు బుధవారం శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

- పొన్నలూరు మండలంలోని చెన్నిపాడువద్ద పాలేరు ఒడ్డున వెలిసిన సంగమేశ్వరస్వామి ఆలయంలో దామచర్ల సత్య దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సత్య దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

క్రీడల్లో సత్తా చాటిన క్విస్ విద్యార్థులు


క్రీడాకారులకు ట్రోఫీని అందజేస్తున్న సూర్యకల్యాణ చక్రవర్తి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక డీఆర్‌ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతలుగా నిలిచారు కబడ్డీలో రన్నర్‌గా పతకం సాధించారు. ఇక 100 మీటర్ల పరుగుపందెంలో మొదటి సంవత్సరం విద్యార్థి బ్రహ్మారెడ్డి ద్వితీయ స్థానంలో, వెంకట శ్రావణ్ నాల్గవ స్థానంలో నిలిచారు. ఆయా పోటీల విజేతలను క్విస్ విద్యాసంస్థల చైర్మన్ నిడమానూరి సూర్యకల్యాణ్‌చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ గాయత్రిలు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించాలని అభిలాషించారు.

'సంగమేశ్వరం' పూర్తి చేయాలి : సీపీఎం


ప్రాజెక్ట్ వద్ద మాట్లాడుతున్న నాయకులు

పొన్నలూరు, ఫిబ్రవరి26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నిపాడు వద్ద పాలేరుపై అర్థాంతరంగా ఆగిన సంగమేశ్వరం ప్రాజెక్ట్‌ను వెంటనే పూర్తిచేసి నాలుగు మండలాల్లోని రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం నాయకుల బృందం సంగమేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టంగుటూరి రాము, కేజీ మస్తాన్ పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం


స్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరం పెళ్లూరు గ్రామంలోని శ్రీబాల త్రిపుర సుందరి సమేత శ్రీ మూల స్థానేశ్వర దేవాలయంలో బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని శివపార్వతుల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భారీగా భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అర్చకుడు భాస్కరశర్మ ప్రవచిస్తూ శివపార్వతుల కల్యాణం తిలకించిన వారికి పాపాలు హరించి ముక్తి ప్రాప్తిస్తుందని చెప్పారు. వేదపండితులు సాయిశర్మ, శశాంక్‌శర్మ, ప్రధాన అర్చకుడు అవెంకటశివసాయి కల్యాణ క్రతువును నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నక్కా అయ్యన్న, కార్పొరేటర్ నాగం శేషగిరి ఏర్పాట్లను భక్తులకు బోడా రామకృష్ణ చీరలు, ఫలాలు పంపిణీ చేశారు. అన్నదానం జరిగింది.

ఉపాస్ హాస్పిటల్‌లో ఎన్టీఆర్ వైద్య సేవలు

- ప్రారంభించిన మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ సత్య


ఆసుపత్రిలోని వార్డును పరిశీలిస్తున్న మంత్రి స్వామి


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ సత్య

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. నగరంలోని సంతపేటలోని ఉపాస్ హార్ట్‌కేర్ హాస్పిటల్‌లో నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఎన్టీఆర్ వైద్యసేవలను మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాస్ హాస్పిటల్ ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రంలో త్వరలోనే ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనుందని తెలిపారు. రూ.2.5 లక్షల నుంచి రూ.25లక్షల వరకు బీమా సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. మారటోరియం బోర్డు చైర్మన్ సత్య మాట్లాడుతూ ఉపాస్ హాస్పిటల్ ద్వారా మెరుగైన సేవలు అందించాలన్నారు. ఉపాస్ హాస్పిటల్ డైరెకర్లు డాక్టర్లుగా వైద్యసేవలు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్లు ఉమాపతి చౌదరి, ప్రకాష్ చావల, అనీల్ కుమార్ పాకా, అనపర్తి శ్రీనివాసరావు కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ చివకుల, అనస్థిషియా యూనిట్ హెడ్ డాక్టర్ కె. పవన్‌కుమార్, న్యూరాలజిస్ట్ డాక్టర్ పి.శ్రీనివాసరావు, డాక్టర్‌లు రాధా, కె.సువర్ణరాజు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, మలినేని ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు, ఉపాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 30శాతం ఐఆర్ ప్రకటించాలి

- జీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు 30శాతం ఐఆర్‌ను వెంటనే ప్రభుత్వం ప్రకటించాలని బీటీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు డిమాండ్ చేశారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ సమావేశానికి కర్ర దేవసహాయం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి ఐదేళ్ళకు పీఆర్సీ కమిటీని ప్రకటించకపోవడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన రూ.25వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, నాలుగేళ్ళ క్రితం పట్టుకున్న సరెండర్‌లీవ్‌లు ఇంత వరకు జమకాకపోవడం బాధకరమన్నారు. గత పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఏల్చూరి మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వం 117 జీవోను రద్దు చేస్తామంటూ పాఠశాలలను కుదింపే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులను మిగులుగా తేల్చడం జరిగిందని, దీనివల్ల విద్యా వ్యవస్థ నష్టపోయే ప్రమాదం ఏర్పడిందని చెప్పారు. అందువల్ల ఈ విధానాన్ని రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు డి.శివకాశయ్య, జి.భాస్కరరావు పాల్గొన్నారు.

భక్తిపారవశ్యంగా జాగరణ కార్యక్రమాలు


కె.ఉప్పలపాడులో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామిల నగరోత్సవం

కొండపి, ఫిబ్రవరి26 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయాల వద్ద జాగరణ చేసే భక్తుల సౌకర్యార్థం బుధవారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కొండపిలోని శ్రీ గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద చిన్నారులతో భరతనాట్యం కార్యక్రమం, శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకాన్ని రిటైర్డ్ లెక్చరర్ బీఎల్. నరిసింహం ఆధ్వర్యంలో నిర్వహించారు. అదే విధంగా కొండపిలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయం వద్ద విద్యుత్ ప్రభ అంకులయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని కె. ఉప్పలపాడు గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో రాత్రి స్వామి వార్ల నగరోత్సవం నిర్వహించారు.


కొండపి అయ్యప్ప ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

రేపు అన్ని పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం నిర్వహించాలి : పీడీ

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం అన్ని పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా స్థాయిలో సైన్స్ దినోత్సవం నిర్వహించేందుకు ఎలిమెంటరీకి రూ.25వేలు, సెకండరీకి రూ50వేలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో విద్యార్థులకు ఈనెల 28న క్విజ్ పోటీలు నిర్వహించాలి. ఎంపవరింగ్ ఇండియన్ యూత్ ఫర్ గ్లోబల్ లీడర్ షిప్ ఇన్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ ఫర్ వికసిత్ భారత్ అనే అంశంపై జిల్లా స్థాయిలో సెమినార్ నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేపు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మద్దిరాలపాడులోని శ్రీసూర్య విద్యానికేతన్‌లో ఈ నెల 28న విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాజీ ఎంపీ సాంబశివరావుకు సత్కారం


సాంబశివరావును సత్కరిస్తున్న నాయకులు

మద్దిపాడు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మాజీ పార్లమెంట్ సభ్యుడు రాయపాటి సాంబశివరావుకు తన అనుచరులతో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని మార్గమధ్యలో బుధవారం మద్దిపాడులో ఆగారు. ఆయన అనుచరుడు జండాపట్ల శ్రీనివాసరావు నివాసం వద్ద కాసేపు విశ్రాంతి తీసుకోగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు కడియాల రఘుబాబునాయుడు, భానుచందర్, వార్డు సభ్యుడు నూనె శ్రీనివాసరావు, కొత్త సుమన్, శుద్దపల్లి నరసింహారావు, పర్వతరెడ్డి శ్రీను, అడపాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడి


బేళ్లను పరిశీలిస్తున్న ఇండోనేషియా ప్రతినిధులు

మద్దిపాడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా పొగాకులో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని జీపీఐ ఇండోనేషియా ప్రతినిధి బృంద సభ్యులు తెలిపారు. బుధవారం మద్దిపాడులోని పల్లకి సత్యనారాయణరెడ్డి బ్యారన్‌ను జీపీఐ సీనియర్ మేనేజర్ పునీత్ హెచ్చి అధ్యక్షతన సందర్శించారు. ఈ సందర్భంగా వారు బ్యారన్‌ను, పొగాకు ఆకును, బేళ్ళను పరిశీలించారు. కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, చావా శ్రీనివాసరావు, సుజాత, అనూరాధ, లక్ష్మి, హేమలత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో గిద్దలూరు పట్టణం ఎన్‌టీఆర్‌కాలనీలో నివాసం ఉండే అనుమాల శ్రీనివాసులు (50) మృతి చెందాడు. ఆయన కుమార్తె హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ శివరాత్రి పండుగకు ట్రైన్‌కు ఇంటికి వస్తుండగా తీసుకువచ్చేందుకు బైక్‌పై వెళుతుండగా కారు ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శంభోశంకర..

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పూజలు

జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు

పోటెత్తిన భక్తులు

నయనమనోహరంగా కల్యాణాలు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజలు మహాశివరాత్రి పండుగను బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ప్రసిద్ధ శైవక్షేత్రాలు, ఆలయాలతో పాటు గ్రామగ్రామాన ఉన్న చిన్న పెద్ద శివాలయాలు ఓం నమఃశివాయ అంటూ శివనామస్మరణతో మారుమోగాయి. పరమేశ్వరుని దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. అర్ధరాత్రి లింగోద్భవం సందర్భంగా మహా రుద్రాభిషేకాన్ని నిర్వహించి అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించగా మరికొన్ని ఆలయాలలో గురువారం ఉదయం కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించటానికి ఏర్పాట్లు చేశారు. ఒంగోలు నగరంలోని పురాతన శివాలయాలు కేశవస్వామిపేట కాశీవిశ్వేశ్వర స్వామి, కొత్తపట్నం బస్టాండులోని రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ కుటుంబ సమేతంగా సంతపేట సాయిబాబా మందిరంలోని శివాలయంలో పూజలు చేశారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జులు శివాలయాలకెళ్లి పూజలు నిర్వహించారు. జిల్లాలోని రామతీర్థం, త్రిపురాంతకం, జరుగుమల్లి, పొదిలి, భైరవకోన తదితర అనేక ప్రాంతాలలోని శివాలయాలలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దర్శనం చేసుకున్నారు.


ఒంగోలు లాయర్‌పేట సాయిబాబా మందిరంలో స్ఫటిక శివలింగం


పొదిలి నిర్మమహేశ్వర గుడిలో కందుల


ఒంగోలులో శివలింగానికి అభిషేకం చేస్తున్న జనార్దన్ దంపతులు


భైరవకోనలో హోమం చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, రాఘవరెడ్డి


కంభం భద్రస్వామి ఆలయంలో అశోక్‌రెడ్డి పూజలు


రామకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు

వైభవంగా మహాశివరాత్రి తిరునాళ్ల

చినగంజాం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి ఆలయం, కొత్తపాలెంలోని బాలకోటేశ్వరస్వామి ఆలయాలలో మహాశివరాత్రి తిరునాళ్లను బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అభిషేకాలు, విశేష పూజలు చేశారు. తిరునాళ్ల సందర్భంగా రామకోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఎనిమిది భారీ డిజిటల్ ప్రభలు, బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద నాలుగు భారీ విద్యుత్ ప్రభలను పోటాపోటీగా ఏర్పాటు చేశారు. వీటిపై టీవీ కళాకారులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ యాంకర్‌లతో నిర్వహించిన మ్యూజికల్ నైట్ కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రామకోటేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళల కోలాటం ఆకట్టుకుంది. చినగంజాం పీహెచ్‌సీ వైద్యులు శిబిరాలను ఏర్పాటు చేశారు. కడవకుదురు గంగా పార్వతి గోకర్ణేశ్వర స్వామి, చినగంజాం గంగా పార్వతి సమేత చిదంబరేశ్వరాలయం, పెదగంజాం ఈశ్వరాలయం, సంతరావూరు రామలింగేశ్వరస్వామి ఆలయం, పలు గ్రామాల్లోని శివాలయాలకు వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. చీరాల డీఎస్పీ మహమ్మద్ మెయిన్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


పూజలు చేస్తున్న భక్తులు

గోవుగుంట..!

గోమాతపై మమకారంతో గోశాలను ఏర్పాటు చేసిన సుబ్బారావు

ఉన్న కొద్దిపాటి పొలం, ఇల్లు సైతం అమ్మి పెంపకం

ప్రస్తుతం దాతల సహకారంతో నిర్వహణ

అతనికి చిన్నతనం నుంచే ఆవులంటే మమకారం.. వాటి మధ్య తిరుగుతూ, వాటి పోషణ చూసుకుంటూ, వాటికి సపర్యలు చేస్తూ గడపడం అంటే ఎంతో ఇష్టం.. అందుకు వారసత్వంగా వచ్చిన కొద్దిపాటి భూమిని అమ్మేశాడు. పాత ఇల్లు సైతం తెగనమ్మి ఆవుల పోషణకు ఖర్చుచేశాడు. వాటికి నీడనిచ్చేందుకు సొంతంగా సెంటు స్థలం లేకున్నా.. మేతకు సొంత పొలం లేకున్నా 74 ఆవులను కంటికి రెప్పలా సాకుతున్నాడు. ఈక్రమంలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నా మొక్కవోని దీక్షతో ముందుకుసాగుతూ గోనుగుంట ఇంటిపేరు కాస్త గోవుగుంటగా ముద్రపడిన సుబ్బారావుపై ప్రత్యేక కథనం...

అద్దంకి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని సాయిబాబా మందిరం ప్రాంతంలో ఉంటున్న గోనుగుంట సుబ్బారావు కాస్త.. ఇంటి పేరు గోవుగుంటగా ముద్రపడింది. చిన్నతనం నుంచి పెళ్లి అయ్యే వరకు అమ్మమ్మ ఊరైన బల్లికురవ మండలం గొర్రెపాడులో ఉన్నాడు. అక్కడ పల్లెటూరు వాతావరణంలో పెరుగుతున్నప్పుడు పశువులపై మమకారం పెరిగింది. ఆ తర్వాత వివాహమై కుమారుడు పుట్టి చనిపోయిన తరువాత అద్దంకి వచ్చాడు. ఆ బాధను అధిగమించేందుకు సుబ్బారావుకు ఆవు, పక్షులు, ఇతర జంతువులను పెంచుకోవాలని ఆలోచన కలిగింది. సుమారు 16 ఏళ్ల కిందట ఒక ఆవును కొన్నారు. ఆ తర్వాత పలు రకాల పక్షులు, కుందేళ్లు తదితర జంతువులను కూడా పెంచడం ప్రారంభించారు. ఈ క్రమంలో సమీప గృహాల ప్రజల నుంచి సుబ్బారావుకు చీదరింపులు ఎదురయ్యాయి.

ఒక ఆవుతో ప్రారంభమై.. 74కు చేరిన గోకులం

గోవులపై మరింత మమకారం పెంచుకున్న సుబ్బారావు 12 ఏళ్ల కిందట అప్పటి ఎమ్మెల్యే ప్రస్తుత మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి గోవులపై తనకున్న మమకారం గురించి చెప్పగా కపిల గోవును బహుమతిగా ఇచ్చారు. ఆ తర్వాత హరిహర గోకులం వెల్ఫేర్ సొసైటీని ప్రారంభించారు.ఈ క్రమంలో పలువురు సంపన్నులు తమ వద్ద ఉన్న గోవులను సంరక్షించలేక సుబ్బారావుకు అప్పగించడం ప్రారంభించారు. మరికొంత మంది రైతులు ఆవుల పోషణ చేయలేక మండీకి అమ్ముతున్నారని తెలిసిన వెంటనే సుబ్బారావు వాళ్ల వద్దకు వెళ్లి గోసంరక్షణ గురించి వివరించి ఎంతో కొంత చెల్లించి తెచ్చేవారు. ప్రస్తుతం గోకులంలో 74 ఆవులు ఉన్నాయి.


అద్దంకిలోని హరిహర గోకులంలో ఉన్న ఆవులు

ఉన్నదంతా అమ్మేసి...

తండ్రి ఇచ్చిన 60 సెంట్లు భూమి 15 లక్షల రూపాయలకు, పాత ఇల్లు రూ.9లక్షలకు అమ్మివేసి గోవుల సంరక్షణకు వెచ్చించారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా కుటుంబం పస్తులున్నా గోవుల సంరక్షణలో మాత్రం వెనకడుగు వేయలేదు. దాతల సహకారంతో గోవులకు అవసరమైన మేత, ఇతర ఆహారం సమకూర్చుకుంటూ గోశాల నిర్వహిస్తున్న సుబ్బారావును పలువురు శభాష్ అని మెచ్చుకుంటున్నారు.

గోశాలకు సొంత స్థలం లేక ఇక్కట్లు

సొంత భూమి లేకపోవడం, గోశాలకు ప్రభుత్వ స్థలం కేటాయింపు ఆలస్యం అవుతోంది. ఈనేపథ్యంలో ఖాళీగా ఉన్న పాత మిల్లుల ఆవరణ, ఇతర స్థలాల్లో గోశాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మూడు చోట్ల మార్పు చేసిన సుబ్బారావు ప్రస్తుతం ఉన్న స్థలం కూడా ఖాళీ చేయాల్సి రావటంతో మరో స్థలంలో తాత్కాలిక గూడు ఏర్పాటు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

గో సంరక్షణే ధ్యేయం



గోనుగుంట సుబ్బారావు, హరిహర గోకులం వెల్ఫేర్ సొసైటీ, అద్దంకి

ఆవులపై ఉన్న మమకారంతో తొలుత ఒక ఆవును కొన్నా. అనంతరం గొట్టిపాటి రవికుమార్ ఇచ్చిన కపిల గోవుకు తోడు, పలువురు గోవులను దానంగా ఇవ్వడంతో గోకులం ఏర్పాటు చేశా. ప్రస్తుతం దాతల సహకారంతో గోవులకు మేత, ఇతర దాణా సమకూరుస్తున్నా. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే దాతల సహకారంతో శాశ్వతంగా గోకులం నిర్మిస్తా.

ఘనంగా పోలురాదా ఎడ్ల పందేలు

రాష్ట్ర స్థాయి పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య


ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని బోయినవారిపాలెంలో బుధవారం న్యూ జూనియర్స్ రాష్ట్ర స్థాయి పోలురాదా ఎడ్ల పందేలను ఘనంగా నిర్వహించారు. గంగా పార్వతీ సమేత భోగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా జరిగిన పోటీలను ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హాజరై ప్రారంభించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో భాగంగా కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాల నుంచి 16 జతలు పాల్గొని హోరాహోరీగా తలపడుతున్నాయి.

ఈదుమూడిలో హెలికాప్టర్ సందడి


ఈదుమూడిలో ల్యాండ్ అవుతున్న హెలికాప్టర్

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పల్లెటూరికి హెలికాప్టర్ రావడంతో గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ఈదుమూడి గ్రామంలో జరుగుతున్న బంధువుల ఓ వివాహ కార్యక్రమంలో భాగంగా వైజాగ్ నుంచి హెలికాప్టర్‌లో కొందరు రావడం చర్చనీయాంశమైంది. హెలికాప్టర్ గ్రామీణ ప్రాంతంలోకి రావడంతో ప్రజలు తిలకించేందుకు ఆసక్తి కనబరిచారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ!


మట్టి రోడ్డుగా మారి గోతులమయమైన చెన్నుపల్లి- వైదన తారు రోడ్డు

నాలుగు మండలాల్లో రహదారుల అభివృద్ధికి

రూ.6.90కోట్లతో ప్రతిపాదనలు

ఆయా గ్రామాల నుంచి ప్రభుత్వానికి వెళ్లిన దస్త్రాలు

మంత్రి గొట్టిపాటి కృషితో తీరనున్న ప్రయాణవెతలు

బల్లికురవ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో దశాబ్దాల నుంచి అభివృద్ధికి నోచుకోని గ్రామీణ పంచాయతీ రాజ్ రోడ్లకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషితో నిధులు మంజూరు కోరుతూ పంపిన ప్రతిపాదనలు అమలు దశలో ఉన్నాయి. ఈ రోడ్లు పూర్తయితే గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు రోడ్ల కష్టాలు తీరనున్నాయి. ఈ రోడ్ల అభివృద్ధికి అవసరమైన నిధులపై అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ఆయా గ్రామాల పంచాయతీల తీర్మానాలను గ్రామీణాభివృద్ధి శాఖకు పంపారు. అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ, అద్దంకి, సంతమాగులూరు, కొరిశపాడు మండలాల్లోని నాలుగు రోడ్లకు రూ.6.90 కోట్ల నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపారు. త్వరలో నిధులు మంజూరు కాగానే రోడ్ల పనులు ప్రారంభం కానున్నాయి.

బల్లికురవ మండలంలోని చెన్నుపల్లి వైదన గ్రామాల పరిధిలో ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డు ఎంతో కాలంగా అధ్వానస్థితిలో ఉంది. అడుగడుగునా మోకాటి లోతు గోతులు ఏర్పడటంతో ఈ మార్గంలో ప్రయాణించే ముక్తేశ్వరం, సూరేపల్లి, వైదన, చెన్నుపల్లి గ్రామాల ప్రజలతో పాటు మండల కేంద్రానికి వచ్చే పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రజలు ఈ రోడ్డు గురించి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రజల విన్నపం మేరకు ఈ రోడ్డు అభివృద్ధికి రూ.3 కోట్లు నిధులు మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మంజూరుకు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. అలానే సంతమాగులూరు మండలం సజ్జాపురం గ్రామం నుంచి సంతమాగులూరు ఆర్అండ్‌బీ రోడ్డు వరకు గ్రామీణ రోడ్డును అభివృద్ధి పరిచేందుకుగాను రూ.1.20 కోట్లు, అలానే అద్దంకి మండలం నరసరావుపేట రోడ్డు నుంచి గోవాడ వరకు ఉన్న రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.1.20 కోట్లు, అలానే కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల నుంచి తమ్మవరం వరకు ఉన్న రోడ్డును తిరిగి అభివృద్ధి పరిచేందుకు రూ.1.50 కోట్ల నిధుల మంజురుకు ప్రతిపాదనలు పంపారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల గురించి పూర్తి నిర్లక్ష్యం చేసిందని, కూటమి ప్రభుత్వం రాగానే గ్రామీణ రోడ్ల గురించి పట్టించుకోవటం హర్షణీయం అని ప్రజలు అంటున్నారు.

గోతులుగా మారిన తారు రోడు



అవీ..ఇవీ



కల్యాణంలో లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరుడు

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుండ్లకమ్మ నదీ తీరాన వెలసియున్న లక్ష్మీపద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి బుధవారం మాసకళ్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం, శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని అర్చకులు నరసింహాచార్యులు మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, అభిషేకాలు, అలంకరణ నిర్వహించారు. అనంతరం లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎం నరసింహులు

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని ఆర్టీసీ డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో లయన్స్ క్లబ్ మార్కాపురం శాఖ ఏర్పాటు చేసిన ఉచిత మంజీరా మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు రామకృష్ణారావు, కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి, డైరెక్టర్లు జగన్‌బాబు, వైవీ నారాయణరెడ్డి, ప్రభాకర్, జవహర్, కృష్ణమూర్తి, గోపాల్, విజయరావు, వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

పొదిలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : అత్యంత వైభవంగా గురువారం జరిగే రథోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ వేమన తెలిపారు. వేలాదిగా భక్తులు తరలివస్తారని అందుకు తగినట్లు 8మంది ఎస్‌లు, ఇద్దరు సీఐలతోపాటుగా 60 నుంచి 70మంది కానిస్టేబుళ్ల, హోంగార్డులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిర్మమహేశ్వరస్వామి దేవాలయం నుంచి చిన్నబస్టాండ్, పెద్దబస్టాండ్, నిమ్మయ్య హోటల్, రాఘవేంద్ర సినిమాహాల్, దర్శిరోడ్డు మీదుగా జరిగే రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. దర్శిరోడ్డులో గల ఆర్టీసీ ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.అదే విధంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్ మళ్లించేందుకు తగు చర్యలు తీసుకుంటునామన్నారు.



ప్రత్యేక పూజల అనంతరం న్యాయాధికారి ప్రత్యూషకు పట్టువస్త్రాలు అందజేస్తున్న ఆలయ అధికారులు

పూజల్లో ఎమ్మెల్యే, న్యాయాధికారి

పొదిలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పండుగ సందర్భంగా శ్రీపార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామిని మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఈవో నారాయణరెడ్డి, చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్యలు ఆయనకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం గురువారం జరగనున్న రథోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ఈసంవత్సరం జరగనున్న తెప్పోత్సవ కోనేరును పరిశీలించి ఘనంగా నిర్వహించాలని సూచించారు. అదే విధంగా జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రత్యూష స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో, చైర్మన్‌లు ప్రత్యేక పూజలు చేయించి పట్టువస్త్రాలు అందజేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు 30శాతం ఐఆర్ ప్రకటించాలి

- బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు 30శాతం ఐఆర్‌ను వెంటనే ప్రభుత్వం ప్రకటించాలని బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు పర్రె వెంకట్రావు డిమాండ్ చేశారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం బహుజన టీచర్స్ అసోసియేషన్ సమావేశానికి కర్ర దేవసహాయం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకు పీఆర్సీ కమిటీని ప్రకటించకపోవడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన రూ.25వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, నాలుగేళ్ళ క్రితం పట్టుకున్న సరెండర్‌లీవ్‌లు ఇంత వరకు జమకాకపోవడం బాధకరమన్నారు. గత పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఏల్చూరి మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వం 117 జీవోను రద్దు చేస్తామంటూ పాఠశాలలను కుదించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులను మిగులుగా తేల్చడం జరిగిందని, దీనివల్ల విద్యా వ్యవస్థ నష్టపోయే ప్రమాదం ఏర్పడిందని చెప్పారు. అందువల్ల ఈ విధానాన్ని రద్దు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు డి.శివకాశయ్య, జి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు దర్శనమిస్తున్న త్రిపురాంతకేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారు

హరోంహర

- శివనామ స్మరణతో మార్మోగిన త్రిపురాంతకేశ్వరాలయం
- పోటెత్తిన భక్తులు, కిటకిటలాడిన క్యూలైన్లు



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

త్రిపురాంతకం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవ క్షేత్రం త్రిపురాంతకేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం భక్తులు భారీ స్థాయిలో పాల్గొని పూజలు చేశా రు. ఈ సందర్భంగా ఆలయాలను అందంగా అలంకరించారు. ఉదయం 3 గంటల నుంచే ఆలయాలకు విచ్చేసిన భక్తులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు శివనామస్మరణలతో మారుమోగాయి. ఉత్సవాల సందర్భంగా దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, త్రిపురాంతకం సీఐ అస్సాన్, ఎస్సై శివబసవరాజు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లను ఈవో డి.రజనీకుమారి పర్యవేక్షించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా త్రిపురాంతక క్షేత్రానికి ఎస్పీ ఏఆర్ దామోదర్, మార్కాపురం సబ్ కలెక్టరు వెంకటత్రివినాగ్, మాగుంట రాఘవ రెడ్డి దంపతులు, వై.పాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పి.రామకృష్ణారెడ్డి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఉద యం నుంచి సాయంత్రం వరకు స్వామి, అమ్మవారి ఆలయాల్లో క్యూలైన్లు కిటకిటలాడాయి. స్వామి దర్శనానికి సుమారు 2 గంటలపైనే సమయం వెచ్చించాల్సి వచ్చింది. స్థానిక స్టేట్ బ్యాంకు మేనేజరు ఏ.రాధాకృష్ణ, అసిస్టెంట్ మేనేజరు వి.శ్రీనుబాబు ఆధ్వర్యంలో భక్తులకు మంచి నీరు, మజ్జిగ ఉచితంగా అందజేశారు. తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ అందరినీ ఆకట్టుకుంది. ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా మహాశివరాత్రి

పొదిలి : మహాశిరాత్రి వేడుకలను మండలంలోని ప్రజలు బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలో వెలసిన శ్రీపార్వతీ సమేత నిర్మమహేశ్వరస్వామివార్లను వేదపండితులు రమేష్ ఆధ్వర్యంలో సుందరంగా అలంకరించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తెల్లవారుజామునుంచే ఇష్టదైవాన్ని దర్శించుకునేందుకు పెద్దఎత్తున దేవాలయానికి చేరుకొని అభిషేకాలు చేసేందుకు క్యూకట్టారు. దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, దీపాలు వెలిగిస్తూ మహిళలు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని పలువురు నాయకులు, అధికారులు దర్శించుకున్నారు. ఈసందర్భంగా అన్నపూర్ణ సేవసమితి ఆధ్వర్యంలో పెద్దఎత్తున అన్నదానం, మానవత స్వచ్ఛందసేవా సంస్థ భక్తులకు మజ్జిక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

కన్నుల పండువగా కల్యాణం

మంగళవారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం గజ వాహనంపై ఊరేగించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

- పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల



స్వామి వారి కల్యాణంలో ఎమ్మెల్యే ముత్తుముల దంపతులు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా గిద్దలూరు ప్రాంతంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాల వద్ద బారులు తీరారు. పరమ శివునికి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. బుధవారం గణపతిపూజ, సుప్రభాతం, మహామంగళ హారతి, అన్నాభిషేకం, నందీశ్వరాభిషేకం నిర్వహించారు. రాత్రి స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, పుష్పలీల దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందించారు. వేదపండితుల మధ్య స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం పందిళ్ళపల్లి మహిళ బృందంచే కోలాటం నిర్వహించారు. అనంతరం పాలుగుళ్ల అంజనేయరెడ్డి ప్రవచనాలు నిర్వహించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కెఎస్‌పల్లె సమీపంలోని భీమలింగేశ్వరస్వామి దేవాలయం, ముండ్లపాడులోని శివాలయం, పాపులవీడులోని శివాలయాలలో భక్తులు బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు.

భక్తులతో కిక్కిరిసిన శైవక్షేత్రాలు

కంభం : కంభం, అర్థవీడు మండలాల్లోని శైవక్షేత్రాలన్నీ శివనామస్మరణతో మారుమోగాయి. చిన్నకంభంలోని వీరభద్ర స్వామి ఆలయంలో శివపార్వతుల విగ్రహాలకు, రావిపాడులోని కోటేశ్వరస్వామి ఆలయం, తురిమెళ్ళలోని కనక సురభేశ్వరాలయం, గుండ్లకమ్మనది ఒడ్డున వెలసిన శ్రీకాశీవిశ్వనాథ కోటేశ్వరస్వామి దేవాలయం, లింగాపురంలోని నాగలింగేశ్వరస్వామి ఆలయం, కంభం పట్టణంలోని శివాలయాలలో బుధవారం తెల్లవారుజామున 4గంటల నుంచే భక్తులు బారులు తీరారు. అన్ని శైవాలయాలలో ఉత్సవ ఏర్పాట్లు చేశారు. కోలాటాలు, భజనలతో దేవాలయ పరిసరాలు సందడిగా మారాయి. అన్ని దేవాలయాలలో అన్నదానం నిర్వహించారు.



చిన్నకంభంలో శివపార్వతులకు పూజలు చేస్తున్న భక్తులు

ఎమ్మెల్యే ముత్తుముల పూజలు

మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కంభం పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో, లింగాపురంలోని నాగలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొనకనమిట్లలో భక్తుల తాకిడి

కొనకనమిట్ల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం నుంచి భక్తుల తాకిడితో శివాలయాలుకిక్కిరిశాయి. మండలంలోని పెదారికట్ల గ్రామంలోని చెన్నకేశవాలయం, చినారికట్లలోని మల్లికార్జున దేవాలయం, సలనూతలలోని రామలింగేశ్వరాలయం , ఎదురాళ్ళపాడు గ్రామంలోని సంఘమేశ్వరాలయంతోపాటు కొనకనమిట్ల, బ్రహ్మణపల్లి గ్రామాల్లోని శివాలయాలు అత్యంత శోభాయమానంగా విరాజిల్లాయి. తెల్లవారుజామునుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా శివరాత్రి పర్వదినాన భక్తులు జాగరణ నిమిత్తం ఉపవాసాలు చేసి శివపార్వతులను దర్శించుకొని తమ మొక్కుబడులు చెల్లించారు.



చినారికట్ల గ్రామంలోని మల్లికార్జున స్వామి

వందలాది వాహనాలు - వేలాది మంది భక్తులు

గిద్దలూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువమెట్ట సమీప నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీగుండ్లబ్రహ్మేశ్వర స్వామి దేవాలయానికి వందలాది వాహనాలు క్యూ కట్టాయి. నల్లమల అడవిలో ఉండడం, దానికితోడు టైగర్ ప్రాజెక్టు పరిధిలో ఈ ప్రాంతం ఉండడంతో అటవీశాఖ అధికారులు కేవలం మహాశివరాత్రి పండుగ రోజు మాత్రమే భక్తులు ఈ దేవాలయానికి వెళ్లేందుకు అనుమతించారు. గిద్దలూరు మండలం దిగువమెట్ట చెక్‌పోస్టు నుంచి అడవిలోకి వాహనాలను అనుమతించారు. కేవలం మధ్యాహ్నం వరకు మాత్రమే దేవాలయానికి వెళ్లేందుకు వాహనాలను అనుమతించగా గిద్దలూరు నియోజకవర్గం నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి వందల సంఖ్యలో వాహనాల్లో భక్తులు తరలివచ్చారు.



మార్కాపురంలో ప్రత్యేక అలంకరణలో మార్కండేశ్వర స్వామి

హరహర మహాదేవ

మార్కాపురం వన్‌టౌన్ : మహా శివరాత్రి పర్వదినాన్ని మార్కాపురం పట్టణంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో స్వామి దర్శనానికి తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు బారులుతీరారు. బుధవారం రాత్రి ఎదురుకోలు, నగరోత్సవం అనంతరం పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎర్రగొండపాలెంలోని కాశీ విశ్వేశ్వర దేవాలయం, వృచ్ఛికల మల్లికార్జున స్వామి దేవాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. కాశీ విశ్వేశ్వర దేవాలయంలో టీడీపీ నాయకులు కొత్తమాసు అనంత వెంకట సుబ్రమణ్యం, పెరుమాళ్ల మల్లికార్జున, చలువాది శ్రీనివాసులు, మలిపెద్ద శివరామకృష్ణలు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

శతకోడు సప్తకోటేశ్వరుడికి పూజలు

పుల్లలచెరువు : మండలంలోని ప్రధాన శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి.ప్రధానంగా శతకోటి లింగాలు గల శతకోడు సప్తకోటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. చాపలమడుగులోని ఉమామహేశ్వర స్వామి శివాలయంలో వేకువజామున 4 గంటలకు అభిషేకంతో పూజలు మొదలయ్యాయి.భక్తులు పెద్దఎత్తున చేరుకోని శివలింగానికి పూజలు నిర్వహించారు.

పెద్ద దోర్నాల : మండలంలోని శ్రీ చెన్నమల్లేశ్వర స్వామి దేవాలయం, తిమ్మాపురంలోని రామలింగేశ్వర స్వామి దేవాలయం, మోట్ల మల్లికార్జునపురంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పార్వతీ పరమేశ్వరులకు వైభోపేతంగా కల్యాణాన్ని జరిపించారు.

ఘనంగా శివరాత్రి వేడుకలు

పెద్దారవీడు : శివరాత్రి పర్వదిన వేడుకలను మండలంలోని శైవ క్షేత్రాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీదుర్గా సమేత బోగేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు మేడవరపు రాఘవశర్మ స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వెలసిన గణపతి, దుర్గాదేవి, అయ్యప్పస్వామి, సుబ్రమణ్యస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. బద్వీటి చెర్లోపల్లి కొండపై వెలసిన శివాలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. చట్లమిట్ట శ్రీ శిరిడీ సాయిబాబా అన్నదాన సత్రం ఆధ్వర్యంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శ్రీశైలం వెళ్లే యాత్రికులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా పూజలు

బేస్తవారపేట : మండలంలోని పలు శివాలయాల్లో మహాశివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు.దరగ కొండపై ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.మోక్షగుండం ముక్తేశ్వరాలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్ ద్వారా శివ దర్శనం ఏర్పాటు చేశారు.



చిన్నకంభంలో బండను లాగుతున్న ఎడ్ల జత

బండలాగుడు పోటీల్లో రాచర్ల ఎడ్లకు ప్రథమ స్థానం

కంభం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చిన్నకంభంలో వెలసిన శ్రీవీరభద్రస్వామి తిరునాళ్లకు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి రెండుపళ్ల ఎడ్ల బండలాగుడు పోటీలో రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన బి.విజయలక్ష్మీనాయుడుకు చెందిన ఎడ్ల జత 3,149 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ. 30వేల నగదు గెలుపొందినట్లు నిర్వాహకుడు శరభారెడ్డి తెలిపారు. ఈ బండలాగుడు పోటీల్లో మొత్తం 15 జతల ఎడ్లు పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా గడివేముల గ్రామానికి చెందిన సంజయ్‌కుమార్ ఎడ్ల జత 3,110 అడుగుల దూరం బండను లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 25వేలు, రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన విజయలక్ష్మీనాయుడు రెండో ఎడ్ల జత 2,700 అడుగుల దూరం బండను లాగి తృతీయ స్థానంలో నిలిచి రూ. 20వేలు, బేస్తవారపేట మండలం బసినేపల్లి గ్రామానికి చెందిన వెలిగండ్ల వెంకటచైతన్యకి చెందిన ఎడ్ల జత 2,495 అడుగుల దూరం బండను లాగి నాల్గవ స్థానంలో నిలిచి రూ. 15వేలు, రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన కె.రంగారెడ్డి ఎడ్ల జత 2,221 అడుగుల దూరం బండను లాగి ఐదవ స్థానంలో నిలిచి రూ. 10వేలు, మార్కాపురం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎం.జకరయ్యకు చెందిన ఎడ్ల జత 1,933 అడుగుల దూరం బండను లాగి 6వ స్థానంలో నిలిచి రూ. 8వేలు, రాచర్ల మండలం అరవీటికోట గ్రామానికి చెందిన రాజరంగారెడ్డికి చెందిన ఎడ్ల జత 1,880 అడుగుల దూరం బండను లాగి 7వ స్థానంలో నిలిచి రూ. 5వేలు, కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన హరికృష్ణయాదవ్ ఎడ్ల జత 1,791 అడుగుల దూరం బండను లాగి 8వ స్థానంలో నిలిచి రూ. 3వేలు గెలుపొందినట్లు నిర్వాహకులు తెలిపారు.



సబ్‌జైలులో భోజనాలను పరిశీలిస్తున్న ఒంగోలు సీనియర్ సివిల్ న్యాయాధికారి హేమలత

సబ్‌జైలులో సివిల్ న్యాయాధికారి తనిఖీ

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు సీనియర్ సివిల్ న్యాయాధికారి , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్.హేమలత పట్టణంలోని సబ్ జైలును బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా జైలులో ఉన్న ఖైదీల ఆరోగ్య పరిస్థితులను, వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నారా అని విచారించారు. ఖైదీలకు అందించే ఆహారాన్ని, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత గల వారికి మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయవాదిని ఉచితంగా ఏర్పాటు చేస్తామని న్యాయాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసారాదానమ్మ, సబ్‌జైలు సూపరింటెండెంట్ పి.రవీంద్రనాథ్, న్యాయవాది ఎన్.అహల్య, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మదుసూదన్‌రావు ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రమణారెడ్డి

గిద్దలూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా టీవీ రమణారెడ్డి నియమితులయ్యారు. బేస్తవారపేట ఎంపీడీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న అయన్ను బదిలీపై గిద్దలూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించగా బాధ్యతలు చేపట్టారు. 6నెలల క్రితం స్థానిక ఎంపీడీవో హేమలతాదేవి బదిలీ కాగా అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఈవోఆర్డీ చెన్నారావు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం రమణారెడ్డిని ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు.

క్రైం సమాచారం

కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్య



మృతురాలు లక్ష్మి

మార్కాపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో గంజాయి లక్ష్మి (20) అనే మహిళ మృతి చెందింది. పట్టణ ఎస్సై సైదుబాబు కథనం మేరకు నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం పార్నపల్లి గ్రామానికి చెందిన లక్ష్మిని మూడేళ్ల క్రితం పట్టణంలోని కొండారెడ్డి కాలనీకి చెందిన గంజాయి సాయికి ఇచ్చి పెద్దలు వివాహం చేశారు. సాయి గ్యాస్ స్టౌలు రిపేరు చేసుకుంటూ, భార్య లక్ష్మి పీకలు అమ్ముకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఆరు నెలల సుస్మిత అనే చిన్నారి పాప ఉంది. రోజూ ఇరువురూ చిన్నపాటి గొడవలు పడుతుండేవారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం 1.00 గంటకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుంది. 1.30 గంటల సమయంలో ఇంట్లోకి వచ్చిన లక్ష్మి అత్త సుశీలమ్మ చీరను విప్పి కిందకు దించింది. చుట్టుపక్కల వాళ్లకు విషయం తెలిపింది. అప్పటికే ఆమె మృతి చెందినట్లు గమనించారు. ఈ మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- వ్యక్తి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధరవారం జరిగింది. అందిన సమాచారం మేరకు గిద్దలూరు పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న అనుమూల శ్రీనివాసులు (50) బుధవారం ఉదయం మోటార్‌బైక్‌పై గిద్దలూరు వైపు వస్తుండగా నంద్యాల వైపు నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాసులు పట్టణంలో దుస్తుల షాపు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. కూతురు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ శివరాత్రి పండుగకు ట్రైన్‌కు వస్తుండగా తీసుకురావాలనే మోటార్ బైక్‌పై వెళుతుండగా ఈఘటన జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హరహర మహాదేవ..

- శివనామస్మరణతో మారుమోగిన శైవక్షేత్రాలు
- బారులుతీరిన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పలుచోట్ల అన్నదానాలు
- వైభవంగా శివపార్వతుల కల్యాణం

దర్శి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వేడుకలు బుధవారం మండలంలో వైభవంగా జరిగాయి. శివాలయాలు వద్ద భక్తులు బారులుతీరారు. శివనామస్మరణతో మారుమోగాయి. దర్శి పట్టణంలోని శ్రీఅన్నపూర్ణ సమేతా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు కిటకిటలాడారు. భక్తులు పూజలు చేసి తీర్థప్రసాదాలు అందుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేశారు. అర్ధరాత్రి 12 గంటలకు శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని పోతవరంలో శ్రీగంగాపార్వతీ సమేతా శ్రీరామలింగేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కోర్లమ డుగు, పోతకమూరు శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాల్లో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, మాజీ ఎంపీపీ పూసల సంజీవయ్య పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన నారాయణస్వామి, భైరవకోన క్షేత్రాలు

సీఎస్‌పురం(పామూరు)ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మిట్టపాలెం, భైరవకోన క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం వేద పారాయణం, రుద్ర హోమాలు నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ విష్ణుమూర్తి స్వామివారికి కల్యాణం, గ్రామోత్సవం నిర్వహించారు. పామూరు మండలంలోని అనుమునిగిరి క్షేత్రంలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. ప్రభతో తిరగళదిన్నె గ్రామం నుంచి అనుమునిగిరి క్షేత్రం వరకు మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

పీసీపల్లిలో..

పీసీపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మండలంలోని పంచలింగాలకొండపై ఉన్న స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ఎమ్మెల్యే ఉగ్రను ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. పెద యిర్లపాడు మల్లేశ్వరస్వామి ఆలయంలో భ్రమరాంబికాసమేత మల్లికార్జున స్వామిల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు సుబ్బారావు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



పీసీపల్లి: పంచలింగాలకొండలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

పామూరులో..

పామూరు,ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి, కనిగిరి రోడ్డులో గల పురాతన శివాలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు, విరాట్‌నగర్‌లో గల బ్రహ్మంగారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవల్లిభుజంగేశ్వర, వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. మండలంలోని పడమరకట్టకిందపల్లిలోగల శ్రీకామాక్షి సమేత మల్లేశ్వరుడు, దాదిరెడ్డిపల్లిలోని శ్రీపార్వతి సమేత నీలకంఠేశ్వరుడు, బొట్లగూడూరులోని శ్రీరామలింగేశ్వరుడు, మోపాడులోని గొందిమల్లేశ్వరుడు, దూబగుంటలో అనుమునిగిరి దేవస్థానాల్లో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం ఏర్పాటుచేశారు. పామూరులో బ్రహ్మకుమారీ ఈశ్వరీయ కేంద్రం ఆధ్వర్యంలో విశ్వశాంతి యాత్ర నిర్వహించారు.



పామూరు: పుష్పాలంకరణలో నారాయణస్వామి



పామూరు: నారాయణస్వామికి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

దొనకొండలో..

దొనకొండ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వేకువ జామునుంచే శివనామ స్మరణతో మార్మోగాయి. దొనకొండలోని ఆనంద ఆశ్రమంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పెద్దగుడిపాడు గ్రామంలోని శివాలయంలోనూ కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తాళ్లూరులో..

తాళ్లూరు ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాలు శివనామస్మరణ తో మారుమోగాయి. శివరాంపురం సమీపానగల అగస్త్యేశ్వరాలయంలో ఈశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గుంటిగంగ సన్నిధిలో ఇటీవల పునఃప్రతిష్ఠించిన పురాతన మల్లేశ్వరస్వామి ఆలయం, లక్కవరంలో పురాతన కాలంలో నిర్మించిన చెన్నమల్లేశ్వరస్వామి ఆలయాల్లో శివునికి ప్రత్యేక పూజలు జరిగాయి. తాళ్లూరులోని రామలింగేశ్వరాలయంలో వేకువ జామున పంచామృత అభిషేకాలు జరిగాయి. బొద్దికూరపాడు గ్రామంలో శ్రీగంగాపార్వతీవర్ధిని సోమేశ్వరదేవాలయం, మాధవరంలో శివాలయం, గంగాభవానీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం గ్రామోత్సవం, కల్యాణం నిర్వహించారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాలు బుధవారం శివ నామ స్మరణతో మారుమోగాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముండ్లమూరులోని శ్రీమల్లమాంబ మల్లికార్జున స్వామి, పసుపుగల్లులోని శ్రీకాశీ విశ్వేశ్వర అన్నపూర్ణదేవి, పెదరావిపాడులోని శ్రీరాజరాజేశ్వరి చెన్నమల్లేశ్వర స్వామి, ఈదరలో శ్రీరాజరాజేశ్వరిదేవి, పెద ఉల్లగల్లులోని శ్రీ గంగా పార్వతి సమేత ఈశ్వరాలయం, పులిపాడులోని శ్రీగంగాపార్వతి సమేత ఊర్దేశ్వర స్వామి, ఈదరలోని శ్రీరాజరాజేశ్వరి ఆలయం, మా రెళ్ళలోని చెన్నమల్లేశ్వరస్వామి, పోలవరం, అగ్రహారం, పూరిమెట్ల గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు.

హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా ఈవో వంశీకృష్ణారెడ్డి, ఎం. శ్యాంసుందర్ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు రాఘవరెడ్డితో కలిసి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణహుతితో స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ పామూరు, సీఎస్‌పురం మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, బొమ్మన బోయిన వెంగయ్య, నాయకులు యారవ శ్రీనివా సులు, బి.రమేష్, సీహెచ్ వెంకట్‌రెడ్డి మాజీ ఎంపీపీ టి.పెదఅల్లూరయ్య, కొప్పల్లి సురేష్, ఎస్సీ మాల కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, భైరవ కోన, మిట్టపాలెం నారాయణస్వామి పుణ్యక్షేత్రంలో వైసీపీ నాయకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్, అన్నా రాంబాబు, దద్దాల నారాయణ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు.



దర్శిలో పూజలందుకుంటున్న అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి



దర్శి: పోతవరంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

అసంపూర్తిగా 'జల్‌జీవన్'

- ఇంటింటికీ చేరని తాగునీరు
- నాలుగురోజులకొకసారి సాగర్ జలాలు సరఫరా
- పర్యవేక్షణను మరచిన అధికారులు

దొనకొండ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో జల్‌జీవన్ మిషన్ పథకాన్ని అమల్లోకి తెచ్చారు. దొనకొండలోని బాదాపురం, వీవీపురం, ఒబ్బాపురం ప్రాంతాల ప్రజలకు ఇంటింటి కొళాయిల ద్వారా నీరందించేందుకు ఈ పథకాన్ని మంజూరుచేశారు. బాదాపురంలో టెండరు పొందిన కాంట్రాక్టర్ ఇంటింటికి కొళాయిలు వేసి కొద్దిమేర పనులను అసంపూర్తిగా మిగిల్చారు. వీవీపురంలో టెండరు పొందిన కాంట్రాక్టర్ పైలట్ ప్రాజెక్టు పథకంలో నిర్మించిన హైలెవల్ ట్యాంకు వద్ద సంపు నిర్మాణం చేపట్టారు. మెయిన్ లైన్ నుంచి సంపు వరకు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి పనులు నిలిపివేశారు. ఫలితంగా నిర్మాణ పనులు అలంకారంగా దర్శనమిస్తున్నాయి. ఒబ్బాపురంలో ఎటువంటి పనులు ప్రారంభంకాలేదు. ఫలితంగా ఆ ప్రాంత ప్రజలు గుక్కెడు నీటికోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పథకం పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవటంతో పురోగతి ఆశించినస్థాయిలో లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

దొనకొండ ప్రజలకు సరఫరా జరిగే సాగర్ జలాలు కొన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం నాలుగురోజుల ఒకసారి, మరికొన్ని ప్రాంతాల్లో వారానికి ఒకసారి సరఫరా అవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సాగర్ జలాలు అందక తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండలంలో మూడు సాగర్ జలాల స్టోరేజీలు ఉన్నాయి. అందులో సంమృద్ధిగా సాగర్‌నీరు ఉన్నా రెండు రోజులకు ఒకసారి దొనకొండకు సాగర్‌నీరు సరఫరా కావటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో కొందరు ప్రజలు బబుల్ వాటర్ కొనుగోలు చేసుకొని దాహార్తి తీర్చుకుంటున్నారు. మరికొందరు బోర్లనీటితోనే వారి అవసరాలు తీర్చుకుంటున్నారు. చందవరం నుంచి దొనకొండకు సాగర్ జలాలు సరఫరా చేసే పైపులైన్ పురాతనమై తరచూ మరమ్మతులకు గురవుతుంది. సంబంధిత అధికారులు స్థానికంగా అందుబాటులో లేకపోవటం కారణంగానే నీటి సమస్యలు ఎదురవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రానున్న వేసవిని గుర్తించి దొనకొండలోని అన్నిప్రాంతాలకు రెండురోజులకు ఒకసారి సాగర్ జలాలు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంకు, సంపు



జల్‌జీవన్ మిషన్ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు

జల్‌జీవన్ మిషన్ పనుల పరిశీలన

తాళ్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తోటవెంగన్నపాలెంలో జల్‌జీవన్‌మిషన్ నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు బుధవారం పరిశీలించారు. ఇంటింటికి మంచినీరు అందించేందుకు జలజీవన్ మిషన్ ద్వారా రూ.48 లక్షల నిధులు మంజూరయ్యాయి. గత రెండు నెలలుగా గ్రామంలో నాలుగు కిలోమీటర్ల పొడవున పైప్‌లైన్ నిర్మాణం, 187 గృహాలకు ఇంటింటికి కుళాయిల ఏర్పాటుచేస్తున్నారు. అందులో రూ.21 లక్షలతో ట్యాంక్ నిర్మాణ పనులు చేపట్టారు. పైప్‌లైన్, ట్యాంక్‌నిర్మాణ పనులను ఎస్ఈతోపాటు డీఈ రామ్మో హన్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వాలి, కోట వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాలనీలకు మహర్దశ

- వసతులను పట్టించుకోని గత వైసీపీ పాలకులు
- కూటమి ప్రభుత్వంలో సీసీ రోడ్లు
- శరవేగంగా పనులు

తాళ్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గ్రామాలకు మౌలిక వసతులు సమకూరుతున్నాయి. ప్రధానంగా కాలనీలవాసుల ఇబ్బందులు తీరనున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో వీటి గురించి పట్టించుకోలేదు. తట్టి మట్టిపోసిన పాపానపోలేదు. ఎస్సీ కాలనీల అభ్యున్నతికి పాటుపడిన దాఖలాలులేవు.

2014-2019 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం సబ్‌ప్లాన్ కింద ఎస్సీ, ఎస్టీ కాలనీలో అంతర్గత సీసీరోడ్లు, సైడు కాలువలు నిర్మించింది. గత వైసీపీ పాలనలో ఈ కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామాల నుంచి కాలనీకి వెళ్లే రహదారులు దారుణంగా ఉన్నాయి. నిత్యం రాకపోకలు సాగించేందుకు ఎస్సీ కాలనీవాసులు పడరానిపాట్లు పడ్డారు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎస్సీ కాలనీల అభివృద్ధిపై దృష్టి సారించింది. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని లక్కవరం, మన్నేపల్లి, తురకపాలెం గ్రామాల నుంచి ఎస్సీ కాలనీల్లో ఐదు పనులకు రూ.కోటి 79 లక్షల నిధులు మంజూరు చేసింది. ఆయా కాలనీలు ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా సరైన రహదారులు లేవు. గ్రామాల్లోకి పనుల నిమిత్తం వచ్చి వెళ్లాలంటే రోడ్లు సక్రమంగా లేక పడరానిపాట్లు పడుతున్నారు. గ్రామాల నుంచి కాలనీలు దాదాపు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. మట్టి రోడ్లలో రాకపోకలు సాగిస్తున్నారు. ఇవికూడ సక్రమంగా లేవు. గుంతలమయమ య్యాయి. వర్షాలు కురిసిన సమయంలో కాలనీలవాసుల పాట్లు వర్ణనాతీతంగా ఉంటాయి. రోడ్లపై వర్షపునీరు నిలిచిపోతుంది. గుంతలలో నీరు నిలిచిపోతుంది. మట్టిరోడ్లన్నీ బురదమయమవుతున్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

అయితే, కూటమి ప్రభుత్వంలో వీరి ఇబ్బందులు తీరనున్నాయి. కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించింది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కాలనీల్లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణాలకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.కోటి 79లక్షల నిధులు మంజూరు చేయించారు. లక్కవరం గ్రామంలో రెండు ఎస్సీ కాలనీల్లో రోడ్ల నిర్మాణం కోసం రూ.57 లక్షలు మంజూరయ్యాయి. మన్నేపల్లి పంచాయతీలోని దారంవారిపాలెం గ్రామం నుంచి రెండు ఎస్సీ కాలనీల రోడ్ల నిర్మాణానికి రూ.72 లక్షలు, తురకపాలెం గ్రామం నుంచి ఎస్సీ కాలనీవరకు రోడ్డు నిర్మాణానికి రూ.46 లక్షలు మంజూరయ్యాయి.

ఈ నిధులతో పనులు జరుగుతున్నాయి. పంచాయతీ రాజ్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారుల పర్యవేక్షణలో శరవేగంగా సాగుతున్నాయి. రోడ్ల నిర్మాణాల్లో కొంత భాగం సీసీరోడ్లు, మరికొంత భాగంలో బీటీ రోడ్లు నిర్మిస్తున్నారు. దీంతో ఎంతోకాలంగా లక్కవరం, దారంవారిపాలెం, తురకపాలెం కాలనీవాసులు ఎదుర్కొంటున్న కష్టాలు తొలగనున్నాయి.



లక్కవరం ఎస్సీ కాలనీ వెళ్లే మార్గంలో వేసిన సీసీ రోడ్డు



దారంవారిపాలెం ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో నూతనంగా నిర్మించిన తారురోడ్డు

తొలగనున్న కాలనీవాసుల కష్టాలు

కోండ్రు ఆదిశేషు, లక్కవరం



లక్కవరం గ్రామ శివారున కిలోమీటర్ దూరంలో కాలనీలో నివాసం ఉంటున్నాం. నిత్యం పనుల నిమిత్తం, ప్రభుత్వ కార్యాలయాల పనుల కోసం కిలో మీటర్ దూరంలో ఉన్న గ్రామంలోకి నిత్యం వెళ్లాల్సి వస్తుంది. రహదారి సక్రమంగా లేక గతుకుల రోడ్డులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి వేళల్లో రోడ్డు సరిగా లేకపోవటంతో కాలనీవాసులు గుంతల్లో పడి గాయపడుతున్నారు. విషజంతువుల బారినపడిన ఘటనలు ఉన్నాయి. వర్షాల సమయంలో నరకయాతన అనుభవిస్తున్నాం. కూటమి ప్రభుత్వం రోడ్లు నిర్మిస్తుండటంతో కాలనీ వాసుల కష్టాలు తొలగనున్నాయి.

అక్రమంగా నిల్వఉంచిన టేకు దుంగల పట్టివేత



టేకు దుంగలను ట్రాక్టర్‌కు లోడు చేయిస్తున్న గార్డు సుభద్ర

పీసీపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): అక్రమంగా దాచి ఉంచిన టేకు దుంగలను అటవీశాఖ అధికారులు మంగళవారం రాత్రి పీసీపల్లిలో పట్టుకున్నారు. అటవీశాఖ గార్డు సుభద్ర తెలిపిన వివరాల మేరకు.. టేకు దుంగలను అక్రమంగా దాచారని అటవీశాఖ అధికారులకు మంగళవారం రాత్రి సమాచారం అందింది. అధికారుల ఆదేశాలతో డీఆర్వో వెంకట సుబ్బయ్య తన సిబ్బందితో రాత్రికిరాత్రే పీసీపల్లికి చేరుకున్నారు. గ్రామ సచివాలయానికి వెనుకవైపు దాచి ఉంచిన టేకు దుంగలను గుర్తించారు. బుధవారం ఉదయం ఈ టేకు దుంగలను ఎవరు తెచ్చారు.. ఇక్కడ దాచిన వ్యక్తులు ఎవరని గ్రామంలో విచారించగా ఎవరూ తమదని ముందుకు రాలేదు. దీంతో కనిగిరి అటవీశాఖ కార్యాలయానికి టేకును తరలించేందుకు యత్నించారు. అయితే, అటవీశాఖ అధికారులకు ట్రాక్టర్‌ను ఏర్పాటుచేసి లోడు చేసేందుకు గ్రామంలో ఎవరూ సహకరించలేదు. దీంతో మారెళ్ల నుంచి ట్రాక్టర్‌ను అద్దెకు తెప్పించిన అటవీశాఖ సిబ్బంది వారే టేకు దుంగలను లోడు చేసుకుని కనిగిరి అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.

ఈవిషయమై కనిగిరి అటవీశాఖ రేంజర్ ఉమామహేశ్వరరెడ్డిని వివరణ కోరగా తమ సిబ్బంది స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు స్థానికంగా కర్ర వ్యాపారం చేస్తున్న ఓవ్యక్తి అక్రమంగా దాచి ఉంచినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించామన్నారు. అటవీశాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు సుమారు 3 నుంచి 4 టన్నులు ఉండవచ్చునని ఆయన తెలిపారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి



నిమ్జ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఎం శ్రేణులు

పామూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నిమ్జ్ పనులు ప్రారంభించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సయ్యద్ హనీఫ్, ఊసా వెంకటేశ్వర్లు, డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని నిమ్జ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2012లో కేంద్రప్రభుత్వం నిమ్జ్‌ను కేటాయించగా అప్పటి అధికారులు 14 వేల ఎకరాలు సేకరించారన్నారు. అయితే, పరిశ్రమల ఏర్పాటుకు నిధులు కేటాయించకపోవడంతో ఈప్రాంత ప్రజలకు ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. పరిశ్రమలు పెడుతున్నామని ప్రజాప్రతినిధులు ఆర్బాటం చేయడమే తప్పా ఆచరణకు నోచుకోలేదన్నారు. తక్షణమే పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బడుగు వెంకటేశ్వర్లు, షేక్ ఖాదర్‌బాషా, సీహెచ్ వెంకటేశ్వర్లు, అల్లభక్ష్, కె.శంకర్, వై.వీరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాలేరు రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలి

పీసీపల్లి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ను సీపీఎం నాయకులు బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆపార్టీ నాయకుడు హనీఫ్ మాట్లాడుతూ కాలువల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. గతంలో ఉగ్ర నరసింహారెడ్డి ఎమ్మెల్యేగా సమయంలో సుమారు 12సంవత్సరాల క్రితం ఈ రిజర్వాయర్‌ను నిర్మించినట్లు చెప్పారు. ఆతరువాత వచ్చిన ఇద్దరు ఎమ్మెల్యేలు ఈరిజర్వాయర్ గురించి పట్టించుకోలేదన్నారు. ఈనెల 28న ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో పాలేరు రిజర్వాయర్‌కు నిధులు కేటాయించి త్వరితగతిన కాలువల నిర్మాణం చేయించాలని హనీఫ్ డిమాండ్ చేశారు. కాలువలు లేకపోడంతో రిజర్వాయర్‌లో నీళ్ల ఉన్నా రైతులు ఉపయోగించుకోలేకపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, ఖాదర్‌బాషా, బడుగు వెంకటేశ్వర్లు, వీరనారాయణ, అల్లాభక్ష్, చల్లా వెంకటేశ్వర్లు, కొండలరావు, శంకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివరాత్రి వేడుకలు



కనిగిరి కొండదిగువ శివాలయంలో 108 శివలింగాలకు పూజలు చేస్తున్న భక్తులు

కనిగిరి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా కనిగిరి నియోజకవర్గంలో శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కనిగిరి పట్టణంలోని కొండపైన విజయమార్తేండేశ్వరస్వామి ఆలయంలో, మండలంలోని నందనమారెళ్లలోని బాలార్కకోటేశ్వరస్వామి, పునుగోడు గ్రామంలోని సిద్ధేశ్వరస్వామి దేవాలయం, సీఎస్‌పురంలోని భైరవకోనలోని భైరవేశ్వరస్వామి ఆలయం, మిట్టపాలెం శ్రీనారాయణస్వామి ఆలయంలో భక్తులు అశేషంగా పాల్గొని పూజలు చేశారు. ఈసందర్భంగా శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. కనిగిరి కొండపై విజయమార్తేండేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సందర్శనతో కొండపైన శివాలయం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. దిగువ శివాలయంలో 108 శివలింగాలకు భక్తులు పాలభిషేకం, ప్రత్యేక పూజలు, నవగ్రహాలకు తైలాభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించి, పూజద్రవ్యాలు సమర్పించారు. ఎంతో ప్రాముఖ్యం కలిగిన పునుగోడు శివాలయానికి కనిగిరి నలుమూలల నుంచి భక్తులు అశేషంగా తరలి వెళ్ళి స్వామివారిని దర్శించుకొని అభిషేకాలు అర్చనలు చేశారు. పునుగోడు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా గ్రామస్థులు ప్రత్యేక ప్రభలతో ఊరేగింపు నిర్వహించి ఆలయంలో పూజలు చేశారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కనిగిరి ప్రాంతంలోని మాచవరం, చాకిరాల, చీర్లదిన్నె, కనకపట్టణంలోని శంకరమఠం శివాలయం భక్తులతో కిటకిటలాడింది. సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయం ప్రత్యేక ప్రభలతో, విద్యుత్ దీపాలతో విరాజిల్లింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఎంపీ మాగుంట తనయుడు రాఘవరెడ్డి సతీసమేతంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలసి ప్రత్యేక హోమాలు, అర్చనలు చేశారు. కనిగిరి మండలంలోని నందనమారెళ్ళ బాలార్కకోటేశ్వరస్వామి ఆలయం, సీఎస్‌పురంలోని భైరవకోన శివాలయం, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయం, పీసీపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం శివలింగాలకు అభిషేకాలు చేశారు.



కొండపై విజయమార్తేండేశ్వర శివలింగాన్ని దర్శించుకుంటున్న భక్తులు





కోటప్పకొండపై భక్తులు

కోటప్ప కొండ కింద భారీ విద్యుత్ ప్రభలు




ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరుడు

శివాయ.. రుద్రాయ

- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- త్రికోటేశ్వరస్వామికి నేత్రపర్వంగా లింగోద్భవ అభిషేకాలు
- కోటయ్యస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం
- కొలువుతీరిన 20 భారీ విద్యుత్ ప్రభలు..
- శివనామస్మరణతో మార్మోగిన అమరావతి, క్వారీ, గోవాడ, కాకాని

హరహర శంభో శంకర.. ఓం నమః శివాయ.. శివాయ రుద్రాయ.. చేదుకో కోటయ్య చేదుకో.. నామస్మరణలతో శైవక్షేత్రాలు మారుమ్రోగగా.. శివయ్య దర్శనాలతో భక్తులు తరించారు. బుధవారం మహాశివరాత్రి మహోత్సవాలు, కోటయ్య తిరునాళ్లు అత్యంత భక్తిశ్రద్ధల మధ్య జరిగాయి. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ భక్త జన సందోహంతో కిటకిట లాడింది. త్రికూటాద్రిపై త్రికో టేశ్వర స్వామి తిరునాళ్ల కన్నుల పండువగా జరిగింది. లక్షలాది మంది భక్తులు కోటయ్య స్వామిని దర్శించుకుని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి వరకు కొండకు భక్తులు తరలి వస్తూనే ఉన్నారు. అర్ధరాత్రి త్రికోటేశ్వరస్వామికి లింగోద్భవ అభిషేకం వైభవంగా జరిగింది. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పిం చడంతో ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామికి పట్టువస్త్రాలు, వెండి ప్రభ సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన 20 భారీ విద్యుత్ ప్రభలు కోటప్పకొండ దిగువున కొలువు దీరాయి. విద్యుత్ కాంతుల్లో ప్రభలు భక్తులకు కనువిందు చేయగా సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలోని అమరావతిలోని అమరేశ్వరాలయం, పెదకాకాని లోని మల్లికార్జునస్వామి వారి ఆలయం, క్వారీ, గోవాడ క్షేత్రాలు భక్తజనంతో కిటకిటలాడాయి.



ప్రత్యేక అలంకరణలో అమరావతి అమరేశ్వర స్వామి



కోటప్పకొండలో త్రికోటేశ్వరుడికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే అరవిందబాబు



సంగం జాగర్లమూడిలో సంగమేశ్వరుడికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి మనోహర్



అమర్తలూరు : గోవాడలో బాల కోటేశ్వరుడిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



క్వారీలో భక్తుల రద్దీ



ప్రత్యేక అలంకరణలో కాకాని మల్లేశ్వరుడు



క్యూలైన్లలో భక్తుల అవస్థలు



ఎన్ఎస్పీ కాలువలో భక్తుల స్నానాలు



తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్ కష్టాలు



సాంస్కృతిక నృత్యాలు

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినం గురువారం భక్త జన సందోహం మధ్య అత్యంత ఘనంగా జరిగింది. కోటప్పకొండపై కోటయ్య తిరునాళ్లతో పాటు అమరావతి అమరేశ్వరాలయం, పెదకాకాని భ్రమరాంబసమేత మల్లికార్జునస్వామి ఆలయం, అమృతలూరు మండలం గోవాడ శ్రీబాలకోటేశ్వస్వామి ఆలయం, చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయాలతో పాటు శైవక్షేత్రాలు బుధవారం శివనామస్మరణలతో మార్మోగాయి. కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధికి భక్తులు పోటెత్తారు. శ్రీత్రికోటేశ్వరస్వామి తిరునాళ్లతో కోటప్పకొండ ప్రాంతం జనసంద్రంగా మారింది. సాయంత్రం నుంచి భక్తుల రద్దీ అంతకంతకు పెరిగింది. తెల్లవారుజామున అర్చకులు బిందె తీర్థం, పంచామృతాలతో అభిషేకాలు చేసి స్వామికి విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. కొండ దిగువన వున్న బొచ్చు కోటయ్యస్వామి వద్ద తలనీలాలను భక్తులు సమర్పించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఎప్పటికప్పుడు ఈవో చంద్రశేఖరరావు, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షించారు. 2,500 పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ సూరజ్, ఆర్డీవో మధులత, డీఎస్పీ నాగేశ్వరరావులతో పాటు వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పరిశీలించారు.

స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

త్రికోటేశ్వరస్వామికి ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టువస్త్రాలను, వెండి ప్రభను సమర్పించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఏడీసీ చంద్రకాంత్, డీసీ శ్రీనివాసరావు ఈవోలు చంద్రశేఖరరావు సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు

పెట్లూరివారిపాలెం మార్గంలో ట్రాఫిక్‌జామ్

నరసరావుపేట నుంచి కోటప్పకొండ వెళ్లే పెట్లూరివారిపాలెం సమీపంలో మధ్యాహ్నం గంట పాటు వాహనాలు నిలిచి పోయాయి. ప్రభలు కొండకు తరలి వెళ్తున్న సమయంలో ట్రాఫిక్ నిలిచింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి క్రమబద్ధీకరించారు.



కొండపై తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

కనువిందు చేసిన ప్రభలు..

త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన 20 భారీ విద్యుత్ ప్రభలు కోటప్పకొండ దిగువన కొలువు దీరాయి. కొండపై ఆలయం, కొండ దిగువన ప్రభలు విద్యుత్ వెలుగుల్లో కాంతులీనాయి. విద్యుత్ వెలుగుల్లో కొండ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగొందింది. ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉదయం 11 గంటల కల్లా భారీ విద్యుత్ ప్రభలు కొండకు చేరుకున్నాయి. ప్రభల రాకతో చిలకలూరి పేట రహదారి శోభాయమానంగా సాగింది. నరసరావుపేట రహదారిలో సాధారణ ప్రభల రాకతో కోలాహలం నెలకొంది.

భక్తులకు చుక్కలు చూపించిన ఆర్టీసీ

కోటప్పకొండ తిరునాళ్లకు తరలివచ్చిన భక్తులకు ఆర్టీసీ చుక్కలు చూపించింది. అరకొరగా బస్సులు ఏర్పాటు చేసి భక్తులను ఇక్కట్లకు గురి చేసింది. బస్సులు లేక భక్తులు కాలినడకన ఘాట్ రోడ్డున కొండ కిందకు చేరుకున్నారు. వీఐపీల సేవలో తరించిన అధికారులు సామాన్య భక్తులను విస్మరించారు. సాయంత్రం వేళ భక్తులు రద్దీగా ఉన్న సమయంలో చాలా తక్కువ సంఖ్యలో బస్సులు ఏర్పాటుతో ప్రయాణికులు తోపులాటకు గురయ్యారు టికెట్ వసూలు చేసిన ఆర్టీసీ అధికారులు బస్సులు ఏర్పాటును విస్మరించి తమను నడిపిస్తున్నారంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

వీఐపీల తాకిడి.. ఆదాయానికి గండి

కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీల తాకిడి భారీగా ఉంది. డీఎస్పీ కార్యాలయం నుంచి 15 వేలకు పైగా వీఐపీ, వీవీఐపీ పాసులు పంపిణీ చేసినట్లు సమాచారం. వీఐపీ క్యూలైన్ కిటకిటలాడింది. వీఐపీల పేరుతో వేలాది మంది స్వామి దర్శనం చేసుకున్నారు. దీంతో క్యూల్లో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీ పాసులు నియంత్రించి ఉంటే టిక్కెట్ కొని స్వామి దర్శనం చేసుకునేవారు. అయితే వారికి పాసులు జారీతో దేవస్థానం ఆదాయానికి రూ.లక్షల్లో గండి పడింది. వీఐపీల వాహనాలకు కొండపైకి అనుమతించడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీల సేవలో కొందరు అధికారులు తరించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖరరావు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, కొలికపూడి శ్రీనివాసరావు, రామాంజనేయులు, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖరరావు, లేళ్ల అప్పిరెడ్డి, జంగా కృష్ణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, దర్శి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ స్వామిని దర్శించుకున్నారు.

శైవక్షేత్రాలు.. భక్తజన సంద్రం

పెదకాకాని, అమరావతి, అమృతలూరు, పొన్నూరుటౌన్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శైవక్షేత్రాలు భక్తజన సంద్రంగా మారాయి. అర్ధరాత్రి లింగోద్భవ పూజల అనంతరం స్వామివార్లను భక్తులు దర్శించుకుని తరించారు. పెదకాకాని మల్లన్న సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదేవి సమేత కాకాని మల్లేశ్వరుడు గ్రామోత్సవంలో పెదకాకాని పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో తెల్లవారుజామున అమరేశ్వరుడికి తొలి అభిషేకం ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్ దంపతులు, ఈవో సునీల్‌కుమార్ సమక్షంలో జరిగింది. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామిని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, జగన్మోహనరావు, కన్నా లక్ష్మీనారాయణ, వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులతో పాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. గురువారం తెల్లవారుజామున అమరేశ్వరస్వామి వార్ల కల్యాణమహోత్సవం జరగనున్నది. కల్యాణమూర్తులకు గురువారం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అమృతలూరు మండలం గోవాడ శ్రీబాలకోటేశ్వస్వామికి అర్ధరాత్రి ప్రత్యేక పూజల అనంతరం దర్శనాలకు భక్తులను అనుమతించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు స్వామి వారిని దర్శించుకున్నారు. చేబ్రోలు మండలంలోని వడ్లమూడి క్వారీ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో అర్ధరాత్రి నుంచి మూలవిరాట్ దర్శనానికి భక్తులు పోటెత్తారు. మహిళలు పొంగళ్లు వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు స్వామి వారికి వస్త్రాలు సమర్పించి అభిషేక పూజలలో పాల్గొన్నారు.





పుట్టవద్ద మహిళల పూజలు



సర్వం శివమయం

- కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, పూజలు
- అర్ధరాత్రి లింగోద్భవం అద్భుతం
- పరవశించిన భక్తకోటి



అద్దంకిలోని పాత శివాలయంలో ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి, మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి



చీరాల శివాలయంలో ప్రత్యేక అలంకరణలో | దైవాలరావూరులోని ఉమామహేశ్వరస్వామికి పూజలు

చీరాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : బుధవారం చీరాల నియోజక వర్గ పరిధిలో ఆలయాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక హోమాలు, రుద్రాభిషేకం, పూజలను మంగళవారం ఉదయం నుంచి గురువారం వేకువజాము వరకూ నిరంతరాయంగా నిర్వహించారు. విశేష పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శైవక్షేత్రాలను నిర్వాహకులు అపురూపంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ నేపథ్యంలో వేకువ జాము నుంచే ఆలయాల వద్ద బారులు తీరారు. పోలీసులు ఆయా ఆలయాల వద్ద ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. పూజలు అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే రాత్రికి శివోద్భావ అభిషేకాలు, హోమాలు, జాగారం వంటివి భక్తులు భక్తిశ్రద్ధలతో పాటించారు.

అద్దంకి : శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. చిన కాశీగా ఖ్యాతికెక్కిన మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల గ్రామోత్సవం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య దంపతులు మణికేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర రాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి పట్టు వ స్త్రాలను మున్సిపల్ చైర్మన్ ఎస్తేరమ్మ, పలువురు కౌన్సిలర్‌లు ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. వేయి స్తంభాల గుడి, కమేశ్వరాలయం లలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

పంగులూరు : మండలంలోని అన్ని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. పంగులూరు, రామకూరు, చందలూరు, మల్లవరం పరిసర గ్రామాలలో భక్తులు అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకోవడంతో ఆధ్యాత్మిక సందడి నెలకుంది. పంగులూరు, చందలూరులో శివ నామ జపంతో ఏకాహం నిర్వహించారు.



కొండాయపాలెంలో మహా రుద్రాభిషేకం చేస్తున్న జ్ఞాన ప్రసూన బాబా, శిష్య బృందం

మేదరమెట్ల : మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. దైవాలరావూరులోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మేదరమెట్లలోని మల్లేశ్వరస్వామి, రావినూతల, కొరిశపాడు, పాసంగులపాడు, పమిడిపాడు తదితర గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కల్యాణ మహోత్సవం నిర్వహించారు.

రామలింగేశ్వరస్వామికి శాంతి కల్యాణం

సంతరావూరు (చినగంజాం) : మండలంలోని సంతరావూరు గ్రామంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి వారికి బుధవారం శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రావూరి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను శేష వస్త్రాలతో, పూలమాలలతో విశేషంగా అలంకరించి, జరుబుల వేణుగోపాలరావు సంధ్యారాణి దంపతులచే వేద మంత్రోచ్చరణ నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ట్రాక్టర్‌లో దేవతా మూర్తులను గ్రామంలోని పురవీధులలో మంగళవాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సంతరావూరు దేవదాయశాఖ ఈవో పోతిన శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకురాలు యార్లగడ్డ లక్ష్మి, గ్రామ పెద్దలు నార్ని ఆంజనేయులు, తోటకూట సుబ్బారావు, భక్తులు పాల్గొన్నారు.

మార్టూరు : మట్టేశ్వరస్వామి, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గన్నవరం రోడ్డులో బొబ్బేపల్లి దండుదారి వద్ద పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

పర్చూరు : పర్చూరు భీమేశ్వరస్వామి ఆలయం, నాగులపాలెం నాగేశ్వరస్వామి, ఉప్పుటూరు అమరేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, చెరుకూరు అగస్త్యేశ్వరస్వామివారి ఆలయంతోపాటు, అడుసుమల్లి గంగా పార్వతి సమేత గౌరీశంకర ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అన్నంబొట్లవారిపాలెంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో జరిగిన పూజల్లో హైకోర్టు న్యాయమూర్తి సురేష్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. న్యాయమూర్తిని అర్చకులు, న్యాయాధికారి శాంతి స్వాగతం పలికారు. బోడవాడ గ్రామంలోని శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి కల్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి.

ఘనంగా రుద్రాభిషేకం

బల్లికురవ : మండలంలోని కొండాయపాలెం గ్రామంలో బుధవారం రాత్రి శివ నామస్మరణలో భక్తులు మునిగి తేలారు. గ్రామానికి చెందిన నీలకంఠేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్త ధూళిపాళ్ల రామగోవింద పూర్తి సహాయ సహకారాలతో గుంటూరు జిల్లా ఫిరంగిపురం వేమవరం వద్ద ఉన్న కోటి లింగాల సహాయార్థం అమ్మ ఆశ్రమానికి చెందిన జ్ఞాన ప్రసూన బాబా ఆధ్వర్యంలో శిష్య బృందం మహా రుద్రాభిషేకం, మహా భస్మాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా మట్టి శివలింగానికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చి గంటపాటు భక్తిశ్రద్ధలతో చూసి తరించారు. వేల బిందెల నీటిని తెచ్చి శివుడికి అభిషేకం చేశారు. మారుముల గ్రామంలో ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం శుభం అని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. రుద్రాభిషేకం ఆనంతరం వచ్చిన భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.



శివాలయంలో పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డి

ఘనంగా అంకమ్మకు కుంకుమార్చన



బిందెల సేవ పూజలో పాల్గొన్న మహిళా భక్తులు

చీరాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలో వేంచేసి ఉన్న అంకమ్మ తల్లి వార్షికోత్సవంలో భాగంగా బుధవారం పసుపు, కుంకుమ సేవా కార్యక్రమం నిర్వహించారు. దీంతో మహిళలు పుణ్య స్నానాలు ఆచరించి బిందెల సేవా కార్యక్రమం జరిపారు. అలాగే మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు జరిగింది. ఆయా పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేశారు.

పెట్రోల్ బంకుల్లో 'గాలి'కి వదిలేశారు



అద్దంకిలో పెట్రోల్ బంక్‌లో వినియోగంలో లేని గాలి మిషన్

అద్దంకి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై అన్ని రకాల సుంకాలు వసూలు చేసే పెట్రోల్ బంక్‌ల నిర్వాహకులు గాలి మిషన్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారన్న విమర్శలు వస్తున్నాయి. సెలవు రోజులైతే బయట గాలి మిషన్‌లు మూసి వేసినప్పుడు వాహనచోదకులకు చుక్కలు కనిపిస్తున్నాయి. అద్దంకి పట్టణం లో 9 పెట్రోల్ బంకులు ఉన్నాయి. వీటిలో రెండు, మూడింటిలో మాత్రమే గాలి మిషన్‌లను వినియోగిస్తుండగా, మిగతా వాటిలో ఆ ఊసే లేదు. సం వత్సరాల తరబడి అవి మూలన పడి ఉన్నాయి. ఇక మరుగుదొడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో వాహనచోదకులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పం దించి అన్ని పెట్రోల్ బంకులలో గాలి మిషన్, మరుగుదొడ్ల ఇతర అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఎక్సైజ్ కేసుల్లో 29 నేరాలకు సీసీ నెంబర్స్

- పెండింగ్‌లో మరో 23
- ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు



ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు

చీరాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : చీరాల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌కు సంబంధించిన ఇటీవల నమోదు చేసిన 52 కేసుల్లో 29కి సీసీ నెంబర్స్ అందినట్లు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. మొత్తం కేసులకు చార్జిషీట్ కోర్టులో దాఖలు చేయగా పెండింగ్‌కు సంబంధించి త్వరలోనే సీసీ నెంబర్స్ వస్తాయ ని తెలిపారు. సీసీ నెంబర్‌లు అందిన కేసులు కోర్టు పరిధిలోకి చేరినట్లు వివరించారు. ప్రభుత్వం ప్రవే శపెట్టిన నిబంధనలు అనుసరించి మాత్రమే మద్యం క్రయవిక్రయాలు జరగాలని భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

నూతలపాడు (పర్చూరు), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం నూతలపాడులో బుధవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చే, ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.14,200 నగదను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఘాట్‌లో స్నానాలు నిషేధం

శివయ్య భక్తులలో నిరాశ



మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేయకుండా ఏర్పాటు చేసిన బారికేడ్‌లు, నిషేధ ఫ్లెక్సీ

అద్దంకి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి రోజు గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి శివయ్యను దర్శించుకుందామనుకున్న భక్తులకు నిరాశే మిగిలింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రధాన శివాలయాలలో ఒకటిగా ఉన్న మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంకు మహాశివరాత్రి, కార్తీక మాసంలో పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. దేవాలయానికి వచ్చిన భక్తులు గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. గత ఏడాది గుండ్లకమ్మ నదిలో నీరు పూర్తి స్థాయిలో ఉండి కూడా భక్తులు స్నానాలు చేసే అవకాశం లేకుండా పోయింది. చేపల చెరువుల నుంచి వ్యర్థాలను రిజర్వాయర్ నీటిలోకి వదలడంతో ఆ వ్యర్థాలన్నీ మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయం వద్ద ఉన్న స్నానాల ఘాట్ వద్ద నీటిపై పేరుకు పోయాయి. అదే సమయంలో పూర్తిస్థాయిలో నీరు ఉన్నాయి. దీంతో స్నానాల ఘాట్ పూర్తిగా మూసి వేసి అడ్డుగా బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో గుండ్లకమ్మ నదీ స్నానాలు చేద్దామని వచ్చిన భక్తులు ఒకింత నిరాశకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చేపల చెరువుల కలుషిత నీరు రిజర్వాయర్ నీటిలో కలవకుండా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. లేకుండా కార్తీక మాసం లో కార్తీక స్నానాలు చేసే భక్తులు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైట్‌బర్లీ రైతులకు కూలీల కొరత

- చేతికి వచ్చినా దక్కించుకోలేని పరిస్థితి
- కోత కోసేవారు కరువు
- కర్నూలు, కడప, శ్రీకాకుళం నుంచి వస్తున్నా చాలని వైనం
- మరోపక్క దిగజారుతున్న ధరలు



తాళ్లకు గుచ్చినా పందిళ్లకు కట్టలేక నేలపైనే ఉంచిన పొగాకు

పర్చూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఓ పక్క గణనీయంగా సాగు విస్తీర్ణం.. మరో పక్క పెరిగిన వ్యవసాయ ఖర్చులు, అరకొర దిగుబడులు, దిగజారుతున్న ధరలతో వైట్ బర్లీ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. గత ఏడాది సాగుచేసుకున్న మిర్చి పైరుకు జెమినీ తెగులు సోకి తీవ్రంగా దెబ్బతినడం, గత ఏడాది వైట్‌బర్లీ పొగాకు దిగుబడితో పాటు ధర ఆశాజనకంగా ఉండడంతో అధిక శాతం మంది రైతులు వైట్‌బర్లీ పొగాకును సాగుచేసుకున్నారు. గతంతో ఎన్నడూ లేని విధంగా పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు మండలాల పరిధిలో దాదాపు రూ.40వేల ఎకరాలకు పైగా రైతులు వైట్ బర్లీ పొగాకును సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.60వేల ఎకరాల్లో వైట్‌బర్లీని సాగు చేయగా అందులో పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని అధికశాతం సాగుచేయడం ఇందుకు నిదర్శనం. ఎక్కువ విస్తీర్ణంలో వైట్‌బర్లీని సాగుచేయడం పంట అంతా ఒకే సారి అందుబాటులోకి రావడంతో కూలీల కొరత తీవ్రంగా మారింది. అధిక కూలీని చెల్లించినా కూలీలు దొరికే పరిస్థితి లేకుండా పోయింది. కర్నూలు, కడప, శ్రీకాకుళం తదితర జిల్లాల నుంచి కూలీలను దిగుమతి చేసుకున్నా పూర్తి స్థాయిలో కూలీలు దొరుకుతున్న దాఖలాలు లేవు. దీంతో పొలంలోనే ఆకలు కోతకు వచ్చి ఎండిపోతున్నా ఏమీ చేయలేని పరిస్థితిలో రైతులు ఉన్నారు. తాళ్లకు గుచ్చిన పొగాకును సైతం పందిళ్లకు కట్టుకోలేక కిందనే పడేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న వైట్‌బర్లీ ధరలను చూస్తుంటే కూలీ ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కూలీలు దొరక్క ఎండిపోతున్న పొగాకు



రాజుగారిపాలెం వాగు వద్ద ఉన్న గ్రానైట్ వ్యర్థాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించివేస్తున్న టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు

గ్రానైట్ వ్యర్థాలు తొలగింపు

మార్టూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాజుగారిపాలెం వాగువద్ద పడవేసిన గ్రానైట్ వ్యర్థాలను బుధవారం ఎట్టకేలకు తొలగించారు. ఈనెల 23వ తేదీన ఆంధ్రజ్యోతిలో రాజుగారిపాలెం వాగువద్ద గ్రానైట్ వ్యర్థాలు అని ప్రచురించిన వార్తపై జిల్లా పంచాయతీ అధికారులు స్పందించారు. వారి ఆదేశాలు మేరకు పంచాయతీ కార్యదర్శి అశోక్ గ్రానైట్ వ్యర్థాలను తొలగింపు చేసేందుకు గ్రామంలోని టీడీపీ నాయకులు చింతలపూడి శ్రీనివాసరావును సంప్రదించారు. దాంతో ఆయన సొంతంగా ఎక్స్‌కవేటర్ సహాయంతో గ్రానైట్ వ్యర్థాలను వాగు నుంచి పూర్తిగా తొలగించారు. దాదాపుగా రెండు గంటలు పనిచేసి వాగు పరిసరాలను శుభ్రం చేశారు. భవిష్యత్‌లో మరల వాగువద్ద గ్రానైట్ వ్యర్థాలను వేయకుండా పంచాయతీవారి ఆధ్వర్యంలో బోర్డులను ఏర్పాటు చేస్తామని అశోక్ తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

చీరాల, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : జయంతి పేటలో వ్యక్తి బలవన్మరణం చెందాడు. అందిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన గడ్డం హరి(40) బేల్దారి మేస్త్రీ. ఇతనికి భార్య, ముగ్గురు సంతానం. కొంత కాలంగా భార్య సొంతూరు జయంతి పేటలోనే నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో ఇటీవల హైదరాబాద్‌లో పనులకు వెళ్లి మూడు రోజుల కిందట వచ్చాడు. అయితే ఏమి జరిగిందో తెలియదు గానీ బుధవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈమేరకు సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జూనియర్ కళాశాల యాజమాన్యం నోటి దురుసు

- ఫీజు చెల్లించలేదని విద్యార్థినిపై పరుష పదజాలం
- తల్లిదండ్రుల ఆగ్రహం
- పునరావృతం కాకుండా చూస్తామని ప్రతినిధుల హామీ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఫీజు చెల్లింపులో రెండు రోజులు ఆలస్యం అయిందని కళాశాల యాజమాన్యం విద్యార్థులపై నోటి దుసురు వ్యాఖ్యాలు చేయడం అందరినీ బాధించింది. దీంతో విద్యార్థులు యాజమాన్యం అన్న మాటలను తల్లిదండ్రులకు చెప్పి, కళశాలకు వెళ్లమని చెప్పడంతో తల్లిదండ్రులు ఆ కళాశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దంకిలోని జూనియర్ కళాశాలలో జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఓ విద్యార్థిని ఫీజు చెల్లించడం రెండ్రోజులు ఆలస్యమైంది. రెండ్రోజుల్లో తండ్రి ఫీజు చెల్లిస్తారని చెప్పినా వినకుండా కళాశాల ఇన్‌చార్జి విద్యార్థినిపై దురుసుగా మాట్లాడారు. వెంటనే ఆ విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేసింది. దీంతో యాజమాన్యంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పిల్లలపై అలా మాట్లాడితే మీకెలా ఉంటుందని నిలదీశారు. ఇకపై పిల్లలను కాలేజీకి పంపించమని తేల్చి చెప్పారు. విషయం తెలుసుకున్న కళాశాల మిగతా యాజమాన్యం తల్లిదండ్రులకు సర్దిచెప్పే ప్రయత్నంలో పడ్డారు. ఫీజు చెల్లించని కొందరు విద్యార్థులపై దురుసుగా మాట్లాడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. పిల్లలను అలా అవమానించడం సరికాదని, మరోసారి ఇలా జరిగితే ఊరుకోమని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుం డా చూస్తామని యాజమాన్యం తల్లిదండ్రులకు నచ్చచెప్పి పంపించారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్.. డ్రైవర్‌కు గాయాలు

చిన్ననందిపాడు(పర్చూరు), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలైన ఘటన మండలం చిన్ననందిపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పర్చూరులో కూలీలను పొలంవద్ద వదిలి పెట్టి తిరిగి వెళుతున్న క్రమంలో పెద్దనందిపాడు నుంచి చిన్ననందిపాడు వైపు వస్తున్న ట్రాక్టర్ ఆటోను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో దెబ్బతినడంతో పాటు డ్రైవర్ జూపూడి సునీల్‌కు గాయాలయ్యాయి. అతడిని 108లో ఆసుపత్రికి తరలించారు.

దాబాలో కోలలపూడి యువకుల వీరంగం

హోటల్ యజమానితోపాటు ఇద్దరు వ్యక్తులపై దాడి

మార్టూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జొన్నతాళి సెంటర్ సమీపంలోని ఒక దాబా హోటల్‌లో మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన 8 మంది యువకులు వీరంగం సృష్టించారు. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. దాంతో వారికి నచ్చచెప్పడానికి ప్రయత్నించిన హోటల్ యజమాని గూగూలా, వంటమనిషి రాజుతో పాటు మరో కార్మికుడిపై ఆ యువకులు దాడి చేసి గాయపరిచారు. ఘటనకు సంబంధించి కోలలపూడికి చెందిన ఆర్‌ఎంపీ రావూరి శ్రీకాంత్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో 7 గురు వ్యక్తుల వివరాలు కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.అందిన సమాచారం మేరకు.. కోలలపూడికి చెందిన 8 మంది యువకులు మద్యం మత్తులో దాబా హోటల్‌కు వచ్చి రొట్టెలు తిన్నారు. ఈ సమయంలో వారి మధ్య గొడవ జరగడంతో వారిని ఆపడానికి హోటల్ యజమాని గూగూల్‌తో పాటు మరో ఇద్దరు వర్కర్లు ఆపడానికి ప్రయత్నించారు. దాంతో వారు మరింత ఆగ్రహంతో హోటల్‌లో ఉన్న కుర్చీలను పగలగొట్టారు. అంతేగాకుండా సీసాలతో గూగూల్‌ను, రాజును గాయపరచగా, మరో వర్కర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ విషయమై సమాచారం అందడంతో హెడ్ కానిస్టేబుల్ గరుత్మంతుడు, నాగేశ్వరరావుతో పాటు పోలీసులు వెళ్లగా వారందరూ పారిపోగా, రావూరి శ్రీకాంత్‌తో పాటు వారికి చెందిన రెండు మోటారు సైకిళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన గూగూల్, రాజును చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారి స్తున్నారు.

ఛిద్రమైన చందలూరు, ఇంకొల్లు రోడ్డు

అడుగడుగునా గోతులతో రాకపోకలకు అంతరాయం

పంగులూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు నుంచి గంగవరం వైపుగా ఇంకొల్లు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు ఛిద్రమైంది. కంకర లేచిపోవడంతో పాటు అడుగుడుగునా ఏర్పడిన గుంతలతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. గ్రామానికి ఉత్తరంగా ఉన్న పొలాలకు వెళ్లే రైతులు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. చందలూరు, గంగవరం మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు ఛిద్రమవడంతో పాటు ఏర్పడిన గోతులపై ప్రయాణం సాగించడం ఇబ్బందిగా ఉందని ద్విచక్రవాహన చోదకులు, ట్రాక్టర్ డ్రైవర్లు వాపోతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కోరుతున్నారు.



కంకర లేచిన చందలూరు - గంగవరం రోడ్డు (ఇన్‌సెట్‌లో) చందలూరు - ఇంకొల్లు రోడ్డులో ఏర్పడి గుంత

నెల్లూరు : వెండి నందిపై కొలువుదీరిన భువనేశ్వరీ సమేత మూల స్థానేశ్వరుడు





నెల్లూరు : సాయంసంధ్యవేళ స్వర్ణలింగేశ్వర స్వామి సన్నిధిలో అద్భుత దృశ్యం

శంభో శివశంభో

భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి ● మారుమోగిన ఓంకారనాథం

ఊరూ వాడ.. శైవక్షేత్రలయ్యాయి. ప్రతి గొంతూ శివనామం జపించింది. ప్రతిపాదం హరుడి ఆలయం వైపు కదిలింది. హరహర శంకర శంభో.. ఓం నమఃశివాయ... నమః పార్వతీ పతయే!.. శంభో శంకర... శంభో శివశంభో.. నామస్మరణలతో శైవాలయాలు మారుమోగాయి. బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అభిషేక ప్రియుడికి విశేష అభిషేకాలు జరిగాయి. ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మంగళవాయిద్యాల నడుమ ఆదిదంపతుల కల్యాణం కనులపండువగా జరిగింది. మైపాడు, ఇసుకపల్లి, కాటేపల్లి, రామతీర్థం తదితర తీరప్రాంతాల్లో సముద్ర స్నానం ఆచరించి, భక్తి శ్రద్ధలతో పరమేశ్వరుడిని పూజించారు.

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శైవ క్షేత్రాల్లో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే సముద్రతీరం, నదీతీరాలు పుణ్యస్నానాల కోసం వచ్చిన భక్తులతో కళకళలాడాయి. శైవ ఆలయాల్లో పాలభిషేకాల కోసం భక్తులు బారులు తీరారు. రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు విస్తృతంగా జరిగాయి. గిన్నెభిక్ష ఉత్సవాలు వేడుకగా జరిగాయి. ఉదయం, సాయంత్రం జరిగిన ఈ పూజలకు భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. దానధర్మాలు, అన్నదాన కార్యక్రమాలు, భారీ ప్రసాద వితరణలు జరిగాయి. నెల్లూరు నగరంతోపాటు జిల్లాలోని అన్ని ప్రముఖ క్షేత్రాలలో రాత్రి లింగోద్భవ అభిషేకాలు అర్ధరాత్రి వరకు జరిగాయి. అనంతరం శివపార్వతులు వెండినందిపై కొలువుదీరి పేట, నగరోత్సవాలకు తరలివెళ్లారు. తమ ముంగిటకు వచ్చిన ఆదిదంపతులకు భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి దర్శించుకున్నారు. అన్ని మండలాల్లో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులతో ఆలయాలు పోటెత్తిపోయాయి. కొండల్లో కోనల్లో వెలిసి వున్న శివయ్యలను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

● నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో బుధవారం తెల్లవారుజాము 2గంటల నుంచి ప్రజలు పాలభిషేకాలు చేయించుకునేందుకు బారులు తీరారు. మహాన్యాస రుద్రాభిషేకాలు జరిగాయి. అనంతరం స్వామివారికి గిన్నెభిక్ష ఉత్సవం జరిగింది. మహాన్యాస రుద్రహోమం అలంకారం, విశేష పూజలు జరిగాయి. రాత్రి 10 గంటల వరకు దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయం పోటెత్తింది. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక పూలంగిసేవ, కుంభ హారతులు, లింగోద్భవ అభిషేకాలు జరిగాయి. అనంతరం భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామికి వెండినందిపై నగరోత్సవం జరిగింది. ఈ కార్యక్రమాలను ఉత్సవ అధికారి, జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

1. సంగం : భీమేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం
2. కావలి : ప్రత్యేక అలంకరణలో పార్వతీసమేత పంచభూతేశ్వర స్వామి
3. సంగం : కామాక్షిదేవి మూలవిరాట్‌కు వెన్నతో అలంకరణ
4. మూలాపేట శివాలయంలో దీపారాధన
5. బుచ్చిరెడ్డిపాలెం : జొన్నవాడలో వెందినందిపై ఆదిదంపతులు



నెల్లూరు : మూలస్థానేశ్వర ఆలయంలో భక్తులు



సీతారామపురం : ఘటిక సిద్దేశ్వరస్వామి ఆలయం వద్ద..



కావలిలో శివాలయం వద్ద బారులు తీరిన భక్తులు



లింగసముద్రంలో కోటయ్యస్వామి సన్నిధిలో..



సీతారామపురం : భైరవకోనలో భక్తజనం



ఇందుకూరుపేట : మైపాడు తీరంలో భక్తులు

ఆ భూములపై విచారణ ప్రారంభం

● రైతుల నుంచి ధ్రువపత్రాల స్వీకరణ

కలువాయి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నగారిపల్లె, మాదన్నగారిపల్లెల్లోని పేదల భూములపై రెవెన్యూ బృందాలు బుధవారం విచారణ ప్రారంభించాయి. ఐదు బృందాలుగా ఏర్పడిన స్కిబంది భూములను పరిశీలించడంతోపాటు రైతుల వద్ద ఉన్న అసైన్‌మెంటు పట్టాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, 1బి అడంగల్ వంటి ధ్రువపత్రాల నకలును తీసుకొంటున్నారు. మాదన్నగారిపల్లె రెవెన్యూ పరిధిలోని ఈ రెండు గ్రామాల్లో జగన్ ప్రభుత్వం చేసిన రీ సర్వేలో జరిగిన తప్పులు కారణంగా పేద రైతులు తీవ్రంగా నష్టపోయారు. రెండు గ్రామాల్లో వందల ఏకరాల ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయిస్తూ అసైన్ చేశారు. ఈ భూముల్లో పలు ప్రభుత్వ పథకాల్లో బోర్లు, బావులు తవ్వకుని వారు పైర్లు సాగు చేసుకుంటున్నారు. అయితే రీ సర్వే సందర్భంగా అధికారులు ఈ భూముల కేటాయింపు చెల్లదని వాటిని ప్రభుత్వ భూములుగా రికార్డులలో నమోదు చేశారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ఈనెల 22న ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో ఓ కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. ఆత్మకూరు ఆర్డీవో పావని ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది ప్రతి రైతు భూమి వద్దకు వెళ్లి వచారిస్తున్నారు. సమగ్ర విచారణ జరిపి పూర్తి స్థాయి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.



రామన్నగారిపల్లెలో రైతులను విచారిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రుణాలిప్పిస్తాం.. రండి!


దళారుల దందా!

● సబ్సిడీ లోన్లు ఇప్పిస్తామని బ్రోకర్ల రంగప్రవేశం
● ఒక్కో రుణానికి రూ.30 వేలు ఇచ్చేలా ఒప్పందం
● అడ్వాన్స్‌గా రూ.5 వేల నుంచి 10 వేలు వసూలు
● రాజకీయ, కుల సంఘాల ముసుగులో దోపిడీ

'మాకు ఆ ఎమ్మెల్యే తెలుసు. ఆ పార్టీలో ఆ పెద్ద నాయకుడు నాకు బాగా పరిచయం. ఉన్నతాధికారితో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. కాబట్టి మీకు రుణం త్వరగా ఇప్పిచ్చే బాధ్యత నాది. మీకు వచ్చే లోన్‌లో రూ.30వేలు ఇస్తే చాలు. అన్నీ నేను చేసేస్తా.'

- దళారులు చెబుతున్న మాటలు ఇవి

నెల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : పేదల బలహీనతను కొందరు దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. పేదలకు స్వయం ఉపాధి కల్పించాలన్న ఉన్నత లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలను మంజూరు చేయగా, వాటిని ఇప్పిస్తామంటూ ఆశ చూపుతున్నారు. ఇందుకు కొంత ఖర్చవుతుందంటూ వసూళ్ల పర్వానికి తెరలేపుతున్నారు. రాజకీయ, కుల సంఘాల ముసుగులో దోపిడీదారులు ఈ మోసానికి పాల్పడుతున్నారు. ఐదేళ్ల తర్వాత సబ్సిడీ రుణాలు మంజూరవుతుండటంతో పేదలు ఎగబడుతున్నారు. దీనినే మోసగాళ్ల అవకాశంగా మలుచుకుంటున్నారు. గతంలోనూ ఇటువంటి సంఘటనలు జిల్లాలో జరగడం, అప్పట్లో కేసులు కూడా నమోదు చేయడం గమనార్హం. గరిష్ఠంగా ఒక్కో స్వయం ఉపాధి యూనిట్ విలువను రూ.5 లక్షలుగా నిర్ణయించారు. అందులో 50 శాతం సబ్సిడీని ప్రభుత్వం అందించనుంది. ఈ నేపథ్యంలో రుణం మంజూరుకు దళారులు కొంత పర్సంటేజీ మాట్లాడుకుంటున్నట్లు తెలుస్తోంది. గరిష్ఠంగా ఒక్కో యూనిట్‌కు రూ.30 వేల వరకూ అడుగుతు న్నట్లు సమాచారం. ఇందులో అడ్వాన్స్‌గా రూ.5 వేల నుంచి 10 వేల వరకూ వసూలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ఇప్పటికే కొందరు దళారులు దరఖాస్తు దారుల నుంచి వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో దిగిన ఫొటోలను ప్రచారం చేసుకుంటూ తమకు పలుకుబడి ఉన్నట్లు నమ్మించి మోసానికి పాల్పడుతున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. కొందరైతే ఏకంగా బీసీ, ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాలకు దరఖాస్తుదారులను తీసుకెళుతున్నట్లు తెలుస్తోంది. అక్కడ వారికి పరిచయమున్న ఒకరిద్దరు ఉద్యోగులతో మాట్లాడిస్తూ 'మీకు లోన్ మంజూరవుతుంది. భయపడాల్సిన పనిలేదు.' అంటూ భరోసా కూడా కల్పిస్తున్నట్లు సమాచారం. త్వరలో తొమ్మిది కార్పొరేషన్ల సబ్సిడీ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూలు జరగనున్నాయి. అలానే ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలుకానుంది. ఈ పరిస్థితుల్లో అధికారులతో పాటు దరఖాస్తుదారులు అప్రమత్తమవ్వాల్సిన సమయం ఆసన్నమైంది.



● 2069 యూనిట్లు.. 18,922 దరఖాస్తులు

పేదలకు స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా ప్రభుత్వం ఐదేళ్ల తర్వాత సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది. బీసీ కార్పొరేషన్‌తో పాటు ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కుమ్మరి, కాపు కార్పొరేషన్ కింద జిల్లాకు 2069 యూనిట్లు మంజూరయ్యాయి. ఇందుకు గానూ రూ.43.12 కోట్లను కేటాయించారు. ఒక్కో యూనిట్ విలువ గరిష్ఠంగా రూ.5 లక్షలు కాగా 50 శాతం సబ్సిడీ, మిగిలిన 50 శాతం బ్యాంకు లోన్ ఉంటుంది. బీసీ కార్పొరేషన్ అధికారులు ఈ సబ్సిడీ రుణాలకు ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించారు. మొత్తం 18,922 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా బీసీ కార్పొరేషన్‌లో 1328 యూనిట్లకు 15,036 దరఖాస్తులు, కాపు కార్పొరేషన్‌లో 231 యూనిట్లకు సంబంధించి 1832 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులన్నిటినీ పరిశీలించి త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అదే సమయంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా సబ్సిడీ రుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ కార్పొరేషన్ కింద జిల్లాకు సుమారు 1300 యూనిట్లు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. ఈ రుణాలకు సంబంధించి త్వరలో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది.

హరహర మహాదేవ..

వైభవంగా మహాశివరాత్రి ● శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు ● శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు


బిట్రగుంట : కల్యాణ వేదికపై గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరుడు

కావలిటౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం హరహర మహాదేవ.. శంభో శంకర.. ఓంకార నాథ.. అంటూ భక్తుల శివ నామస్మరణలతో ఆలయాలు మారుమ్రోగాయి. పట్టణ పరిధిలోని శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. వెంగళరావునగర్, ముసునూరు, మందాటి చెరువు ట్రంకురోడ్డులోని హనుమత్ క్షేత్రంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని పాతూరులో ఉన్న శ్రీదుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ప్రాచీన ఆలయం భక్తులతో పోటెత్తింది. శివదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి శివదర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్యాపార, ప్రజా సేవా సంఘాలు భక్తులకు ఉచితంగా మజ్జిగ, ప్రసాదాలు,


అల్లూరు : హోమంలో పాల్గొన్న బీద గిరిధర్, సుజన దంపతులు

తులసి మెక్కలు పంపిణీ చేశారు.

● కావలిరూరల్ : మండలంలోని గౌరవరంలో వెలసియున్న పార్వతి సమేత పంచభూతేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. విశేష పూజల అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం, పల్లకి పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రాత్రి అన్నాభిషేకం పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● అల్లూరు : మండలంలోని ఇస్కపల్లిలో వెలసిన అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, హోమాలు, అల్లూరు, నార్తుమోపూరుల్లోని శివాలయాల్లో అత్యంత వైభవంగా విశిష్ట పూజలు నిర్వహించారు. రాత్రి మహిళా భక్తులు దీపాలు వెలిగించారు. రాత్రి జాగారం చేపట్టి మహా శివుని స్మరించుకుంటూ శివరాత్రి పుణ్య పవిత్రతను చాటారు.

● కొండాపురం : మండల పరిధిలోని గుడవళ్లూరు. ఆదిమూర్తిపురం, కొమ్మి, గరిమెనపెంట, తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు వేకువజాము నుండే అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దరించుకున్నారు. విశేష పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కొండాపురంలోని వీరబ్రహ్మంగారి ఆలయంలో స్వామివారికి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అలాగే లింగసముద్రంలో వెలసియున్న తిరుమణిశెట్టి


లింగసముద్రం : మొగిలిచెర్లలో దత్తాత్రేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కొటయ్య సమాధి దర్శనానికి కొండాపురం మండలంలోని దాదాపు అన్ని గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. మహాశివరాత్రి పర్వదినాన తిరుమణిశెట్టి కోటయ్య సమాధిని దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం.

● లింగసముద్రం : లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరానికి ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు, సేవాసమితులు, ఆర్యవైశ్యులు మంచినీరు, అన్నప్రసాదం అందజేశారు. టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన మజ్జిగ, మంచినీటి ప్యాకెట్ల పంపిణీని గుడ్లూరు సీఐ మంగారావు, లింగసముద్రం ఎస్సై షేక్ మహబూబ్ సుభానీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, నేతలు అడపా రంగయ్య, మాజీ ఎంపీపీ పీ. బాలకోటయ్య, కిలారి రమణయ్య. జంపాల శివప్రసాద్, ఎలిపాటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. మొగిలిచెర్ల దత్తాత్రేయస్వామి ఆలయ నిర్వాహకులు పవని నాగేంద్రప్రసాద్ భక్తులకు మధ్యాహ్నం, రాత్రి అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తుల కోసం కోలాటం, పండరి భజన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సీఐలు మంగారావు, వెంకటేశ్వరరావు, పలువురు ఎస్సైలు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీ.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. అలాగే తిరుమణిశెట్టి కోటయ్యస్వా, మొగిలిచెర్ల దత్తాత్రేయ స్వామిలను, గొల్లపాలెం వద్ద నాగదేవతను కందుకూరు వైసీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదనరావు యాదవ్ దర్శించుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, మండల కన్వీనర్ ఎన్ వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం : మండలంలోని వలేటివారిపాలెం, పోకూరు, కళవళ్ల, రోళ్లపాడు, కొండసముద్రం తదితర గ్రామాల్లో బుధవారం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులతో పోటెత్తిన ఆలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. దేవతామూర్తుల విగ్రహాలను రకరకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయాలు కనువిందు చేశాయి. వలేటివారిపాలెంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఈవో కార్తీక్, అర్చకులు వేదమంత్రాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు దామా మల్లేశ్వరరావు, వలేటి మధుసూదన్‌రావు, కాకుమాని హర్ష, కాకుమాని ఆంజనేయులు, వలేటి నరసింహం, గుత్తా మహేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

● కలిగిరి : మండలంలోని సిద్దకొండూరులోని సిద్దేశ్వర స్వామి ఆలయం, కలిగిరిలోని పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే కాకర్లసురేష్ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు. అధిక సంఖ్యలో భక్తుల తరలి రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి.


ఉదయగిరి రూరల్ పెద్దిరెడ్డిపల్లిలో ఆదిదంపతులకు కల్యాణం

● బిట్రగుంట : బోగోలు మండలంలోని శైవక్షేత్రాల్లో పార్వతీపరమేశ్వర్ల కల్యాణం వైభవంగా జరిగింది. నాగులవరంలో గంగాపార్వతి సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సందర్శించారు. స్థానిక టీడీపీ నేతలు కాండ్ర సతీష్‌నాయుడు, రామసుబ్బానాయుడు, జంగందేవర్ల ఏకసిరి అంకయ్య, మహేష్‌లతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. విశ్వనాథరావుపేట రామస్వామిపాలెంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నెల్లూరుకు చెందిన మామిడాల చంద్రశేఖర్, అరుణకుమారి దంపతులు ప్రత్యేక పూజలు జరిపించారు. ముంగమూరులోని పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామికి సర్పంచు రాయి.వినోద్‌యాదవ్ సుప్రజ దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.


చేజర్ల : కోటితీర్థంలో ప్రత్యేక పూజల్లో కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడు దంపతులు


చేజర్ల : ప్రత్యేక పూజల్లో మెట్టుకూరు ధనుంజయరెడ్డి దంపతులు

రామస్వామిపాలెం, నాగులవరంలో రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది.

● కందుకూరు : కందుకూరు పట్టణం, పరిసర గ్రామాల్లోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉండి కుటుంబసమేతంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని స్కందపురి సోమేశ్వరాలయానికి ఉదయం నుంచే భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు స్కందపురి సోమేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా ఈవో రవి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. సోమేశ్వరుడు, జనార్ధనస్వామి, అయ్యప్పస్వామి, కోదండరామాలయాలతో పాటు మండలంలోని కొండముడుసుపాలెం, మోపాడు, మాచవరం, ఓగూరు, పలుకూరు తదితర గ్రామాల్లోని శివాలయాల్లోను భక్తులు పెద్దసంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఉలవపాడు : మండలంలోని శైవక్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో మిన్నంటాయి. దక్షిణ కాశీగా పేరుగడించిన మన్నేటికోట అమరలింగేశ్వర స్వామి ఆలయం ఉదయం నుంచి భక్తులతో కిక్కిరిసింది. కరేడు గ్రామం బాలకోటయ్య సంఘంలోని శివాలయం, రాజుపాలెం భీమేశ్వరుడి ఆలయం, మన్నేటికోట అమరలింగేశ్వర స్వామి ఆలయంలో కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరమ శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులు, ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.

● ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. అన్నపూర్ణ


కందుకూరు : సోమేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి శివరాత్రి జాగరణలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. తిరునాళ్లతిప్పలో కాశీనాయన ఆశ్రమంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. పట్టణంలోని శ్రీభూ దేవి శ్రీదేవి సమేత అలమునాథస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి, అభయాంజనేయస్వామి, శ్రీనివాసేశ్వరస్వామి, షిర్డిసాయిబాబా ఆలయాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● దుత్తలూరు (ఉదయగిరి) : దుత్తలూరు సంజీవ శిఖరంపై ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం కల్యాణోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఉదయగిరి, కావలి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంబం విజయరామిరెడ్డిలు స్వామివారి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు రామలింగేశ్వరస్వామి క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటుచేసిన తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానంతోపాటు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈకార్యక్ర మంలో మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: పట్టణంలోని శ్రీపార్వతీపరమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి సాయంత్రం స్వామి వారి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించి పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని గండిపాళెం, లింగాలదొన క్షేత్రం, యర్రబల్లిగడ్డ, గుడినరవ, అప్పసముద్రం, ఆర్లపడియ, జీ.అయ్యవారిపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ఉదయగిరి రూరల్ : గండిపాళెం, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల ఆలయాలలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. అలాగే వరికుంటపాడు, కాంచెరువు, తోటల చెరువుపల్లిలో శివరాత్రి మహోత్సవాలను నిర్వహించారు.

● సంగం : మండలంలోని సంగమేశ్వరాలయంలో పాతాళ శివలింగానికి, వంగల్లులోని భీమేశ్వరాలయంలో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భీమేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. కామాక్షిదేవి మూలవిరాట్‌ను వెన్నతో అలంకరించారు. తిరుమన కొండపై ఉన్న శ్రీ రాజరాజేశ్వరీదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో అభిషేకాలు, హోమం తదితర పూజలు నిర్వహించారు. సంగం మెయిన్ బజార్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు జాగరణ చేశారు. గాంధీజనసంఘంలోని చంద్రమౌళేశ్వరాలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వంగల్లులో భీమేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి భీమేశ్వరస్వామి నందివాహన సేవ వైభవంగా జరిగింది.

● చేజర్ల : స్థానిక, మండలంలోని కాకివాయి హంస రామస్వామి ఆశ్రమం, చిత్తలూరులోని వీరభద్రస్వామి ఆలయం, చేజర్లలోని శివాలయాలలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోటితీర్థం గ్రామంలో కామాక్షిదేవి సమేత కోటీశ్వరస్వామి ఆలయాన్ని కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడు దంపతులు, మాజీ ఎన్‌డిసిసి బ్యాంక్ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి దంపతులు, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవచౌదరి దంపతులు,


దుత్తలూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో అర్చకుల ఆశీర్వాదాలు పొందుతున్న ఎమ్మెల్యేలు కాకర్ల, దగుమాటి, మాజీ ఎమ్మెల్యే కంభం

ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ తదితర ప్రముఖులు దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 11 గంటల నుంచి గురువారం తెల్లవారుజాము వరకు లింగోద్భవ దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున స్వామి వారికి నందిసేవ వైభవంగా నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ తిరుమలరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొమ్మి పార్థసారధి ఆధ్వర్యంలో పుష్పాలంకరణ, విద్యుత్ దీపాలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

● సీతారామపురం : మహాశివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలోని దేవరకొండ లోయలో సిద్దేశ్వరకోనలోని ఇష్టకామేశ్వరి సమేత ఘటిక సిద్దేశ్వరస్వామి, భైరవకోనలోని త్రిముఖ దుర్గాదేవి, సీతారామపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్కంటికి జాలా


ఆత్మకూరు శివాలయంలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణం

బిషేకం, పాలబిషేకం చేశారు. ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఘటిక సిద్దేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం మహాలింగార్చన, రాత్రి లింగోద్భవ సమయంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మండల పరిధిలోని సిద్దేశ్వరంలోని శ్రీఇష్టకామేశ్వరి సమేత ఘటిక సిద్దేశ్వరస్వామిని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, వారి కుటుంబ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘటిక సిద్దేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న శ్రీ హజరత్ సయ్యద్ మహమ్మద్ దర్గాను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్ రాజు, నాయకులు చైతన్య, చేన్నకేశవులు, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ కలివెల జ్యోతి, షేక్ బాబు, భోగినేని కాశీరత్తయ్య, ఎదమ ప్రవీణ్, జాషువా, ఇజ్రాయిల్, ఆదినారాయణ, మండల టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.


వలేటివారిపాలెం : ప్రత్యేక అలకరణలో భ్రమరాంబికదేవి

మహిళా స్ఫూర్తికి నిదర్శనం దేవిరెడ్డి శారద ట్రస్ట్

● కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి


రక్తదాన శిబిరంలో పాల్గొన్న కావ్య కృష్ణారెడ్డి

అల్లూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దేవిరెడ్డి శారద చారిటబల్ ట్రస్ట్ ఓ మహిళా స్ఫూర్తికి నిదర్శనమని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. దేవిరెడ్డి శారద 8వ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని నార్తుమోపూరు ఇందుపూరు కాలువ సమీపంలోని డీఎస్ఆర్ ట్రస్ట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేవిరెడ్డి శారద విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఏసీఎస్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్ నెల్లూరు వారు నిర్వహించిన రక్తదాన శిబిరంలో 75 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్ హెచ్‌వో వీ.సుజాత, అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు కట్టా వెంకటేశ్వర్లు, నవీన్‌కుమార్, ట్రస్టీ దశరథరామిరెడ్డి, ట్రస్ట్ అడ్మిన్ మేనేజర్ ఇందుపూరు అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత చౌదరి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బండ్ల రామచంద్రరావు, కొప్పు శ్రీనివాసులు, బండి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి దేవిరెడ్డి శారద విగ్రహానికి ఘన నివాళులర్పించారు. దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి కుటుంబం గతంలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలను గురించి ఆయన కొనియాడారు.

తలసీమియా బాధితురాలికి
రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

కావలి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తలసీమియా వ్యాధితో బాధపడుతున్న సైదపేట మునిమోక్షత అనే చిన్నారికి మంజూరైన రూ.10 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరైంది. దీనికి సంబంధించిన పత్రాన్ని బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అందచేశారు. పట్టణంలోని వైకుంఠపురంకు చెందిన మునిమోక్షిత మేజర్ తలసీమియా వ్యాధితో బాధపడుతూ చెన్నై హాస్పటిల్‌లో చేరారు. అక్కడ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్స కోసం రూ.25 లక్షలు ఖర్చు అవుతోందని చెప్పారు. దీంతో వారు ఎమ్మెల్యేను ఆశ్రయించగా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించి రూ.10 లక్షల మంజూరు చేయించారు.

రేపు మాలకొండలో బహిరంగ వేలం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండలో శుక్రవారం మూడోసారి బహిరంగ వేలం పాటలు జగనున్నాయి. ఆలయ అధికారులు ఈనెల 7వ తేదీన మొదటిసారి బహిరంగ వేలం పాటలు నిర్వహించగా తలనీలాలు వేలం పాట మాత్రమే జరిగింది. మిగిలిన 11 దుకాణాలకు సరైన పాటలు రానందున వాయిదా వేశారు. రెండోసారి ఈనెల 21న వేలం పాటలు పెట్టారు. 11 దుకాణాలకు 3 దుకాణాలకు మాత్రమే పాటదారులు పాడుకున్నారు. దీంతో 8 దుకాణాలకు వేలం వాయిదా వేశారు. వాయిదా పడిన పాటలకు ఈనెల 28వ వేలం పాటలు పెట్టనున్నారు. ఈ సారైనా పాటలకు పాటదారులు డిపాజిట్ చెల్లించి పాడేనా లేక ఈసారి కూడా వాయిదా పడేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతోన్నాయి.

క్రీడా సామగ్రి అందజేత


క్రీడా సామగ్రి అందజేస్తున్న కూటమి నాయకులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు గుమ్మలంపాటి వెంగళరావు తన స్వంత నిధులతో యువకులు, విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేశారు. బుధవారం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ రసూల్ మాట్లాడుతూ స్వగ్రామంపై మమకారంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం గుమ్మలంపాటితో కలిసి పాఠశాల విద్యార్థులతో సహా తోటలచెరువుపల్లి, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల యువకులకు క్రికెట్ కిట్లు, షటిల్, వాలీబాల్, క్యారమ్స్, చెస్ బోర్డులు, తదితర క్రీడా సామాగ్రిని అందజేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పత్తి జానీ, హజరత్తయ్య, నాగభూషణం, జయరాం, నరసింహారావు, రవి, అవినాష్, ప్రధానోపాధ్యయులు కేశవమూర్తి, ఉపాధ్యాయులు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కావలిరూరల్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జువ్విగుంటపాలెంకు చెందిన ఆటో డ్రైవర్ ఆజ్యం నాగేంద్రబాబు(29) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందగా బుధవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు... ఈ నెల 6వ తేదీన నాగేంద్రబాబు ఫిట్స్‌తో ఇంటి వద్ద పడిపోగా పట్టణంలోని ఓ హాస్పిటల్ కు తీసుకువెళ్లగా రెండు రోజుల పాటు చికిత్స అనంతరం ఇంటికి తీసుకువెళ్లారు. ఇంటి వద్ద పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడని మళ్లీ అదే హాస్పిటల్‌కు అక్కడ నుంచి నెల్లూరుకు అక్కడి నుంచి తిరుపతి సిమ్స్‌కు తీసుకువెళ్లగా ఆపరేషన్ అనంతరం ఈనెల 25వ తేది రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య జ్యోత్స్న ఫిర్యాదుతో ఎస్‌ఐ బాజిబాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తాళ్లూరు కుటుంబానికి పలువురి పరామర్శ

దగదర్తి(బిట్రగుంట), ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం కాట్రాయిపాడుకు చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు తాళ్లూరు సుధాకర్‌నాయుడు తండ్రి తాళ్లూరు వెంకటకృష్ణయ్య నాయుడు ఇటీవల మృతి చెందారు. దీంతో టీడీపీకి చెందిన పలువురు నేతలు ఆయన కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. టీడీపీ మండల కన్వీనర్ హనుమతరావు, ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, చవటపుతేడు సర్పంచు పులిశీనయ్య, తిమ్మసముద్రం టీడీపీ నేత మధుసూదనరావు, బోగోలు మండల టీడీపీ కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, జిల్లా నేత కోడూరు వెంకటేశ్వరరెడ్డిలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెంకటక్రిష్ణయ్య చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజిలి ఘటించారు. తాళ్లూరు సుధాకర్‌నాయుడు సతీమణి విజయమ్మ మాజీ సర్పంచు


ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాళ్లూరు వెంకటకృష్ణయ్య నాయుడు చిత్రపటం

కావడంతో పంచాయతీ వాసులే కాకుండా ఇతర పంచాయతీలకు చెందిన పలువురు నేతలు కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ముస్లిం జేఏసీ నాయకులు

కావలిటౌన్, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ 1913లో ఢిల్లీ సుల్తాన్‌ల హయాంలో వక్ఫ్ బోర్డు ఏర్పడిందని, అనాదిగా వస్తున్న విధానాన్ని కాదని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం నూతన విధానాలతో వక్ఫ్ సవరణ చట్టం తెచ్చేందుకు బిల్లును తీసుకురావడం దుర్మార్గమన్నారు. సవరణ బిల్లును వెనక్కి తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్డీవోకు, టీడీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌కు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు హజరత్, జిలానీని, ఇబ్రహీం, రఫి, జమీర్, మహబూబ్ బాషా, బుష్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బిట్రగుంట, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు గ్రామ సమీపంలో నీరు సరఫరా చేసే ఆటో ఢీకొని ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కావలి మండలం గౌరవరం గిరిజన కాలనీకి చెందిన యాదగిరి శీను(17) బోగోలు మండలం ముంగమూరులో ఓ రైతు పొలంలో పురుగుల మందు కొట్టి బుధవారం రాత్రి తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ముంగమూరు దాటిన తరువాత వాగు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో శీను అక్కడికక్కడే మృతి చెందగా అతనితో వచ్చిన మరో వ్యక్తి యాదగిరి గణేష్ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సిమెంట్‌రోడ్డు నిర్మాణంపై గ్రామస్థుల హర్షం


నిర్మించిన సిమెంట్‌రోడ్డు

ఉదయగిరి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నూతన రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతోపాటు చిన్నపాటి మరమ్మతులకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రహదారుల నిర్మాణాలు, మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టింది. ఉదయగిరి పట్టణంలోని బాలాజీనగర్‌లో దశాబ్దాల క్రితం ఏర్పాటుచేసిన సిమెంట్‌రోడ్డు దెబ్బతినడంతోపాటు వర్షాల సమయంలో రహదారిపై నీరు నిలిచి రోజుల తరబడి ఉండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం 184 మీటర్ల పొడువునా సుమారు రూ.12 లక్షల వ్యయంతో సిమెంట్‌రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాదచారులు, వాహన దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి
దరఖాస్తు చేసుకోండి

కందుకూరు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.మేకపాడులో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో రానున్న విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ యూ.దాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2013 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఓసీ, బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఎస్సీ, ఎస్టీలు అర్హులని తెలిపారు. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులు గురువారం నుంచి మార్చి 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు.